


22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక





బుధవారం 12-08-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 125 రూ॥ 6.00





# అసందర్భ ప్రేలాపి..

# చావు పిశాచి!

ABN ఆంధ్రజ్యోతి







ABN ఆంధ్రజ్యోతి

నా పాడె మోస్తాడనుకున్నా

- పెద్ది సుదర్శన్ రెడ్డిని కోల్పోవడం దురదృష్టకరం
- ఆయన కుటుంబానికి అండగా ఉంటాం: కేసీఆర్
- సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శ
- బీఆర్ఎస్ తరఫున రూ. 2.25 కోట్ల సాయం అందజేత

నా పాడె మోస్తాడనుకున్నా..

- ఆనాటి నుంచి అదే బుద్ధి.. అది "బాధాకృష్ణ" చచ్చే దాకా పోదు.
- "రొచ్చు కృష్ణ"రోజు కలత నిద్రలో కనే కలవరింతలు...
- నిరంతరం కేసీఆర్ మీద "బాధాకృష్ణ" కనే క్షుద్ర కలలు!
- కేసీఆర్ నాయకుడు కాకుంటే బాగుండు.
- కేసీఆర్ జై తెలంగాణ అనకుంటే బాగుండు.
- కేసీఆర్ తెలంగాణ కోసం కొట్లాడకుంటే బాగుండు.

## •ఎల్ల కాలం కేసీఆర్ మీద క్షుద్ర కలలు కనే కురూపి!
## •తెలంగాణ మొత్తం ఉమ్మినా "బాధాకృష్ణ" కు సిగ్గురాదు?
## •"బాధాకృష్ణ" బతికున్నంత కాలం ఇక బుద్దిరాదు?
## •కేసీఆర్ మీద విషం చిమ్మకుండా బతకలేడు!

- కేసీఆర్ తెలంగాణ తేకుంటే బాగుండు.
- ఉమ్మడి రాష్ట్రం అలాగే వుంటే ఎంతో సంతోషంగా ఉండు.
- తెలంగాణ కరువుతో అల్లాడితేనే ఆనందంగా ఉండు.
- తెలంగాణ వచ్చినా కేసీఆర్ సీఎం కాకుంటే మంచిగుండు.
- కేసీఆర్ వచ్చి నీళ్లు తెచ్చిండు.
- చంద్రబాబు ను తెలంగాణ నుంచి తరిమేసిండు.
- తెలంగాణ లో తెలుగుదేశం లేకుండా చేసిండు.
- పచ్చ జెండాలు తెలంగాణలో కనపడకుండా చేసిండు.
- తెలంగాణ లో సైకిల్ లేకుండా చేసిండు.
- పల్లెల్లో ఇంటికో కారు కొనుక్కునేలా చేసిండు.
- సైకిల్ కు కూడా దిక్కులేని తెలంగాణ మొత్తం కార్లతో నింపిండు.
- ఆంధ్రకు వున్న అన్నపూర్ణ అనే పేరు చెడిపేసిండు.
- తెలంగాణ ను అన్నపూర్ణ చేసిండు.
- తెలంగాణ తెచ్చి ఆంధ్రా కు దిక్కు దివాణం లేకుండా చేసిండు.
- తెలంగాణలో ఆంధ్ర పెత్తనం లేకుండా చేసిండు.
- తెలంగాణ యాసకు పూర్వ వైభవం తెచ్చిండు.
- కేసీఆర్ అనే నాయకుడు వుండొద్దు!
- కేసీఆర్ ను జనం కొలువొద్దు.
- కేసీఆర్ తెలంగాణ జాతి పిత అనిపించుకోవొద్దు.
- తెలంగాణ నెంబర్ వన్ కావొద్దు.
- తెలంగాణలో మళ్ళీ బీఆర్ఎస్ రావొద్దు.
- కేసీఆర్ మళ్ళీ సీఎం కావొద్దు.
- "బాధాకృష్ణ" రోజు కనే దరిద్రపు కలలు ఇంత చెండాలం.
- మెలుకువ వచ్చేసరికి ఎక్కడ విన్నా కేసీఆర్ కీర్తి ని "బాధాకృష్ణ" తట్టుకోలేక పోతున్నాడు.
- కేసీఆర్ ను మళ్ళీ జనం కోరుకుంటుంటే జీర్ణించుకోలేక పోతున్నాడు.
- కేసీఆర్ పాలన కావాలని అంటుంటే వినలేక పోతున్నాడు.
- కేసీఆర్ సీఎం అయిన కొద్ది రాజులకే కేసీఆర్ ఆరోగ్యం బాగాలేదని ప్రచారం చేసిండు.
- 2018 ముందస్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతుందని వార్తలు రాసిండు.
- తెలంగాణ తొలి ఎమ్మెల్యే లను కల్లు తాగిన కోతులన్నాడు?
- టూరింగ్ టాకీస్ ల సినిమా చూసే మొఖాలన్నాడు.
- అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టే బుద్ది "బాధాకృష్ణ" పోనిచ్చుకోవడంలేదు

హైదరాబాద్, నేటిధాత్రి:

సమాజంలో కొంత మంది విచిత్రమైన వ్యక్తులుంటారు. సమయం సందర్భం లేకుండా, ఏ మాట్లాడుతున్నారో కనీసం వాళ్లకు కూడా అవగాహన లేకుండా మాట్లాడుతుంటారు. ఒంటి మీద సోయిలేని కూతలు కూస్తుంటారు. మనం మాట్లాడేది పది మంది విని గొప్పగా చెప్పుకోవాలి గాని, ధూ అని మొహం మీద ఉమ్మేస్తారేమో అనే ఆలోచన కూడా వుండదు. అయితే అలాంటివారిని వారిని చూసి సమాజం పిచ్చివాళ్లనుకుంటారు. కొన్నిసార్లు సమాజం కూడా జాలి చూపించే ప్రయత్నం చేస్తుంది. కాని ఆ వ్యక్తులు పిచ్చి వాళ్లు కూడా ఈర్ష్యా పరులు. వాళ్ల ముందుకు ఇంకో కులం నిలబడకూడదు. ఇంకో ప్రాంతం బాగు పడకూడదు. వాళ్లు నచ్చే వాళ్లు తప్ప మరొకరు గొప్పగా కనిపించకూడదు అనుకుంటారు. పైకి నెయ్యం నటిస్తూనే కయ్యం పెట్టుకుంటుంటారు. అది కూడా గిచ్చి కయ్యం పెట్టుకొని శునకానందం పొందుతుంటారు. అలాంటి వారిలో బూతు కిట్టు అని, భాదా కృష్ణ అని, చీకటి జ్యోతి అని తెలంగాణ ప్రజల చేత ఎప్పుడూ తిట్లు తినాలనే కోరుకునే ఈర్ష్యాలువు వుంటాడు. అతని వయసు కూడా 70పైనే వుంటుంది. కాని అతను ఎల్లకాలం బతికుంటాననే భ్రమల్లో తేలియాడుతుంటాడు. కేసిఆర్ లాంటి యుగ పురుషుడు, కారణజన్ముడు మాత్రం ఎప్పుడు పోతాడా? అని క్షుద్ర రాతలు రాస్తుంటాడు. జన్మకు కనీసం సిగ్గు శరం మొత్తం వదిలేసి, ఏం రాస్తున్నాననే ఇంగిత జ్ఞానం కూడా లేకుండా ప్రతిసారి కేసిఆర్ మీద తన అక్కసుకును వెళ్లగక్కుకుంటుంటాడు. తెలంగాణ సమాజమంతా చీచీ అని తిడుతున్నా సరే నన్ను కాదనుకుంటాడు. తెలంగాణ మొత్తం అతని మీద ఉమ్మినా దున్నపోతు మీద వానపడ్డట్టు వ్యవహరిస్తుంటాడు. ఎంత సేపు కేసిఆర్ మరణాన్ని కోరుకుంటుంటాడు. కేసిఆర్‌కు ఆరోగ్యం బాగాలేదని వార్తలు రాస్తుంటాడు. కేసిఆరే స్వయంగా తనకు ఈ సమస్య వుంది, ఆ సమస్య వుందని చెప్పినట్లు రాస్తుంటాడు. తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురౌతుంటాడు. తాను, తన గురువు చంద్రబాబు మాత్రమే బాగుండాలి. లోకంలో అందరూ పోవాలి అని కోరుకునేంత దుష్ట ఆలోచనలు కలిగి వుంటాడు. సమయం సందర్భం లేకుండా ఏది పడితే అది రాయడం వేరు. కేసిఆర్ ఎప్పుడు చనిపోతాడా? అని కలలో కూడా ఎదురుచూస్తుంటాడు. అంతటి దుర్మార్గపు దుష్ట రాతలు రాస్తుంటాడు. తాజాగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు కేసిఆర్ నల్లబెల్లికి వెళ్లడం జరిగింది. అక్కడ పెద్ది బార్యా, పిల్లలను ఓదార్చారు. ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా వుంటుందని ధైర్యం చెప్పారు. ఎలాంటి అవసరం వచ్చినా పార్టీ చూసుకుంటుందని పెద్ది కుటుంబానికి పెద్దదిక్కుగా నేనున్నాని మాట ఇచ్చారు. ఇంతటి గంభీరమైన సమయంలో తన పాడే పెద్ది మోస్తాడననుకున్నాను అని కేసిఆర్ పెద్ది కుటుంబ సభ్యులతో అన్నట్లు బాధాకృష్ణ రాసుకొచ్చారు. ఇలాంటి వార్తలు రాయడం అసలు మనిషిన్న వాడు రాయగలడా? కేవలం పిశాచీ గుణం వున్నవాడు, మాత్రమే రాస్తాడు. దుష్ట దుర్మార్గులే రాస్తారు. సమయం సందర్భం లేకపోయినా సరే అలాంటి వార్తలు రాసి రాక్షసానందం పొందుతుంటాడు. నిజానికి అంత గొప్ప సన్ని వేశాన్ని ఇతర రాజీకీయ పార్టీలు, నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించాల్సిన సందర్భం. ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ చరిత్రలో ఒక నాయకుడు అకాల మరణం పొందితే పార్టీలు సానుభూతి చూపడమో, నాలుగు సంతాప సభలు ఏర్పాటుచేయడమో మాత్రమే చేస్తాయి. మొదటిసారి బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుడైన పెద్ది కుటుంబానికి ఆర్ధికపరమైన చేయూతను అందించడం జరిగింది. దేశంలో వున్న అన్ని పార్టీలు ఆదర్శంగా తీసుకోవాలని బాదాకృష్ణ రాయాల్సివుంది. అది వదిలేసి ఏవోవే కట్టుకథలు, పిట్ట కథల్లా ఒక ఉద్విగ్నమైన క్షణాన్ని కూడా కంపు కంపు చేసే దుర్మార్గపు ఆలోచనలు రాధాకృష్ణకు మాత్రమే వస్తాయిని మరోసారి నిరూపించుకున్నారు. బాదాకృష్ణ నిత్యం తన అక్షరాలతో కాళ్లు కడిగిన నెత్తిన పోసుకునే చంద్రబాబు ఇన్నేళ్ల చరిత్రలో ఎంతో మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు చనిపోయారు. ఆయా సమయాల్లో కేసిఆర్‌లాగా నాయకులను కాపాడుకునే ప్రయత్నం ఒక్క సారైనా చేశారా? అది కదా? బాధా కృష్ణ అది కదా రాయాల్సింది! జాతీయ పార్టీలైన బిజేపి, కాంగ్రెస్‌లు ఇన్నేళ్ల చరిత్రలో కేసిఆర్‌లాగా పార్టీ నాయకులను ఆదుకున్న చరిత్ర వుందా? అని కడిగిపారేయాల్సిన చోట, దిక్కుమాలిన రోత రాతలు రాసి తెలంగాణ చేత ధూ అని ఉమ్మించుకుంటున్నాడు. తెలంగాణలో కేసిఆర్ ఏది చేసినా ఒక సంచనలనమే. అది అందరికీ స్ఫూర్తి దాయకమే. దేశమనే అనుసరించేలా గొప్ప ఆలోచనలు చేయడం కేసిఆర్‌కు మాత్రమే సొంతం. ముఖ్యంగా తెలంగాణ రైతాంగం విషయంలో రైతు బంధు, ఆడ పిల్ల పెల్లి విషయంలో కళ్యాణ లక్ష్మిలు కూడా గతంలో ఎవరూ ఆలోచించిన పథకాలు కాదు. సమాజంలో దళిత సంక్షేమం అంటూ స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి మాటలు తప్ప కాంగ్రెస్ సాయం చేసింది కాదు. ఎన్నడూ లేదు. కాని దళితులు సమాజంలో ఇతర వర్గాలతో సమానంగా ఆత్మగౌరవంతో బతకాలంటే ముందకు వారిని ఆర్ధికంగా తీర్చిదిద్దాలని దళిత బంధు అమలు చేశారు. వారిలో స్వయం శక్తిని మేలు కొలిపారు. ఇలాంటి ఎంతో ఉన్నతమైన ఆలోచనలు, ఆశయాలతో ప్రజలకు సేవ చేయడమే కాకుండా, సమాజంలో చైతన్యం, ఆర్ధిక పరిపుష్టి నింపిన కేసిఆర్ లాంటి నాయుకుడు దేశంలోనే కాదు, ప్రపంచంలోనే లేరు. ఇప్పటికే మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడు రైతు బంధు, కళ్యాణ లక్ష్మి, దళిత బంధు అలాంటి విప్లవాత్మకమైన కార్యక్రమాలు ఆలోచించిన నాయకుడు కాదు. పాలకుడు అసలే కాదు. ప్రభుత్వాసుపత్రుల్లో కూడా ఫీజలు వసూలు చేస్తే నాణ్యమైన వైద్యం అందించొచ్చని ఆలోచించి ఓపి వైద్య సేవలకు 25 సంవత్సరాల క్రితమే రూపాయి వసూలు చేసిన పాలకుడు చంద్రబాబు. అలాంటి నాయకుడు మాత్రమే బాదాకృష్ణకు ఆదర్శం. చంద్రబాబు ఏది ప్రజల నడ్డి విరిచే పనులు చేసినా బాదాకృష్ణకు గొప్పగా కనిపిస్తుంది. బాధాకృష్ణకు టైమ్ మిషన్ లాంటిది ఏదైనా వుంటే మాత్రం కాలాన్ని వెనక్కితీసుకెళ్లి, మళ్లీ ఉమ్మడి రాష్ట్రం చేసేవాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చంద్రబాబు మాత్రమే సిఎంగా ఊహాత్మక కల్పనకనేవాడేమో? కేసిఆర్ తెలంగాణ ఉద్యమంలేని తెలంగాణ, కరువు కాటకాల తెలంగాణ మాత్రమే కనిపించే కలలు కనేవాడేమో? కాని కేసిఆర్ తెలంగాణ తెచ్చి అన్ని రంగాలలో అభివృద్ధి చేశాడు. అది బాదాకృష్ణ కోరుకున్నది కాదు. తెలంగాణ నీళ్లు ఆపుకుంటే ఆంధ్రా ఎండిపోతుంది. బాదాకృష్ణగుండె చెరువౌతుంది. ఆంధ్రా ఎండితే బాదాకృష్ణ గుండె చూసి తట్టుకోలేదు. అన్న పూర్ణ అని పిలిపించుకున్న ఆంధ్రా కంటే తెలంగాణ ఎక్కువ సాగులోకి రావడం చూసి బాదాకృష్ణకు నిద్రకూడా పట్టడం లేదు. పోలవరం ఎన్ని సార్లు నిర్మాణదశలోకొట్టుకుపోయినా అది చంద్రబాబు తప్పు కాదు. ఒక్క డ్యామ్ నిర్మాణానికే పదేళ్లుదాటిపోయినా అది చంద్రబాబు అలసత్వం కాదు. కాని కాళేశ్వరంలో మేడిగడ్డలో వున్న 280 పిల్లర్లలో రెండు పిల్లర్లు పర్రెలు పడితే మాత్రం లక్ష కోట్లు గంగలో పోయినట్లు? అలాగైనా సరే కాళేశ్వరం పని చేయకుండా వుండాలి. మేడి గడ్డను పడావు పెట్టాలి. దాని నుంచి నీళ్లు ఆంధ్రాకు ఎప్పటికప్పుడు వెళ్లిపోవాలి. ఆంధ్రా ఎప్పుడూ సస్యశ్యామలంగా వుండాలి. ఇదీ బాధాకృష్ణ తపన. తెలంగాణ వాస్తవ్యుడిననిచెప్పుకుంటూ పొరుగు రాష్ట్రం బాగు కోరుకునే వాడు ఇంటి వాడెలా అవుతాడు. సొంతవాడెలా అవుతాడు. తెలంగాణ రావడాన్ని కూడా జీర్ణించుకోలేని వాడు తెలంగాణను ఎందుకు కోరుకుంటాడు. తెలంగాణ తెచ్చిన పుణ్యపురుషుడైన కేసిఆర్ చావు వార్త ఎప్పుడెప్పుడు వినాలి? ఎదురుచూసే దుష్టశక్తి బాదాకృష్ణ? మనిషి రూపంలో వున్న రాక్షసత్యం కళ్లల్లో కనిపించేలా రాతల్లో చూపించే చావు పిశాచి బాదాకృష్ణను తెలంగాణ సమాజం దుమ్మెత్తిపోస్తున్నా దులుపుకుంటూనే వున్నాడు. పిచ్చి కూతలతో శవరాతలు రాస్తూనే వున్నాడు. దేవుడిలాంటి కేసిఆర్‌ను నిందించడమే తన రాక్షస గుణం అని పదే పదే నిరూపించుకుంటున్నాడు. ఎందుకంటే దైవాన్ని దూషిస్తేనే దెయ్యం వుందని తెలుస్తందని అలా తనను కూడా గుర్తిస్తారని బాదాకృష్ణ అనుకుంటుంటాడు. అందుకే తెలంగాణ దేవుడు కేసిఆర్‌పై రాక్షస కురూపి బాదాకృష్ణ రోత రాతలు రాస్తూనేవుంటాడు. పశ్చాత్తాపం లేని బాధా కృష్ణ పాపం తగిలిపోతాడు...ఇది తెలంగాణ శాపం.




22nd ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

బుధవారం 12-08-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 125 రూ॥ 6.00


## సగర్వంగా హర్ ఘర్ తిరంగా!



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ఆగస్టు 15న ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా'లో భాగస్వాములు కావాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ 'వందేమాతరం' స్ఫూర్తితో వికసిత్ భారత నిర్మాణానికి సంకల్పం తీసుకోవాలని సూచించారు.

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

- పెండింగ్ భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి
- 7.5 కి.మీ. రోడ్డు విస్తరణ.. టెండర్లకు సిద్ధం కావాలి
- రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలి : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మెట్రో రెండో దశ పనులపై మంగళవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌కు సంబంధించి పెండింగ్ భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసి, మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. మెట్రోలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లను కొనుగోలు చేయాలని సీఎం తెలిపారు. ఆధునిక సాంకేతికతపై ఢిల్లీ మెట్రో నుంచి సలహాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.





## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

- అర్హత ప్రమాణాల్లో మార్పుల్లేవ్
- పాత మార్గదర్శకాల ప్రకారమే అర్హత పరిశీలన
- ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ



హైదరాబాద్,నేటిధాత్రి:
చేయూత సామాజిక భద్రత పింఛన్ల కింద కొత్త లబ్ధిదారుల ఎంపికకు తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, తలసేమియా, సికిల్‌సెల్, హీమోఫీలియా బాధితులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అర్హత ఉన్నవారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.
క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్లు మంజూరు చేయనున్నారు.

## వర్షాభావంలోనూ 15% వృద్ధే లక్ష్యం!

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొంటూ అభివృద్ధి-సంక్షేమం
- ప్రజలపై ధరల భారం పడకుండా కార్యాచరణ
- అధికారులు, ఉద్యోగులు, ప్రజల భాగస్వామ్యంతో 'స్వర్ణాంధ్ర' సాధన : సీఎం చంద్రబాబు



అమరావతి, నేటిధాత్రి:
సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రం 15 శాతం వృద్ధిరేటు సాధించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వర్షాల లోటు కారణంగా ప్రజలపై అదనపు ధరల భారం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరు, నెలవారీ ఆర్థిక ప్రగతిపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన

05 లో

## మండలాల్లో ఇక ప్రజావాణి!



హైదరాబాద్, నేటిధాత్రి:
ప్రజా సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 4ను జారీ చేసింది.
మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణపై ఎంపీడీవోలకు అవగాహన, శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్ ప్రజాభవన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించింది.

# రేవంత్ షెల్ కంపెనీల బాగోతం బయటపెడుతాం

- సీఎం సోదరులంతా పెద్ద కంపెనీల యజమానులు
- భూ కేటాయింపులు, కాంట్రాక్టులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్, నేటిధాత్రి:
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన కంపెనీలు, భూ కేటాయింపులు, కాంట్రాక్టుల వ్యవహారంపై త్వరలో పూర్తి వివరాలను బయటపెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం సోదరులు కొత్త కంపెనీలు ఏర్పాటు చేసుకుంటున్నారని, వాటికి ప్రభుత్వం విలువైన భూములను కేటాయించిందని ఆరోపించారు.
ఒక్క ఉద్యోగి కూడా లేని కొత్త కంపెనీలు ఎలా ఏర్పాటవుతున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. చిన్నచిన్న ఇంటి చిరునామాలతో పెద్ద కంపెనీలను నమోదు చేశారని ఆరోపించారు. అలాంటి కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల విలువైన భూములను ఎలా కేటాయించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### టెస్రాక్ట్ కంపెనీపై ప్రశ్నల వర్షం

సీఎం సోదరుడు అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు ఛైర్మన్‌గా ఉన్నానని తన లింక్‌డిన్ ప్రొఫైల్‌లో పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు. ఒక్క ఉద్యోగి కూడా లేని సంస్థను లక్ష రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసి, దానికి వేల కోట్ల విలువైన భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ. 2 వేల కోట్ల విలువైన స్థలాన్ని రూ. 7 వేల కోట్లకు కేటాయించారనే ఆరోపణలను ప్రస్తావించిన కేటీఆర్.. టెస్రాక్ట్ సంస్థకు కొండల్‌రెడ్డికి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. తన శాఖలో జరుగుతున్న వ్యవహారాలు మంత్రికి తెలియవా? లేక సీఎం ఒత్తిడికి తలొగ్గుతున్నారా? అని నిలదీశారు.

### కాంట్రాక్టులపైనా ఆరోపణలు

సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు హాజరవుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తున్నారని నిలదీశారు. భూ కేటాయింపుల వ్యవహారాన్ని తాము వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

### గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు

భూ కేటాయింపులపై రాష్ట్ర గవర్నర్‌ను కలిసి విచారణ కోరుతామని కేటీఆర్ తెలిపారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించిన భూ వ్యవహారంపై కేసు నమోదైన విషయాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణలోనూ నిబంధనల ఉల్లంఘన జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### 74 లక్షల ఓట్ల తొలగింపుపై ఆందోళన

రాష్ట్రంలో 74 లక్షల ఓట్లు తొలగించే అవకాశం ఉందన్న ప్రచారం ఆందోళనకరంగా ఉందని కేటీఆర్ అన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా చూస్తామని చెప్పారు.

### జీఆర్ఎంబీపై స్పష్టత ఇవ్వాలి

తెలంగాణకు అన్యాయం చేసేలా ఉన్న జీఆర్ఎంబీ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం హాజరవుతుందా? లేదా? స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. జలసౌధలో జరిగే సమావేశం అజెండాలో మార్పులు చేస్తే జలసౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రం చెబుతున్నా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

### వర్షాల కోసం యాగాలు కాదు.. పనులు చేయాలి

వర్షాల కోసం వరుణ యాగం చేయడంలో తప్పు లేదని, అయితే ప్రభుత్వం చేయాల్సిన పనులను మాత్రం సమర్థవంతంగా చేయాలని కేటీఆర్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. భూ కేటాయింపులు, కంపెనీల వ్యవహారంపై త్వరలో మరిన్ని వివరాలను ఆధారాలతో సహా వెల్లడిస్తామని కేటీఆర్ ప్రకటించారు.

## గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు!

- అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా సదస్సు
- పెట్టుబడులే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో భారీగా పెట్టుబడులను ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మిట్ సన్నద్ధతపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.
తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటేలా సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని సూచించారు. వ్యాపార రంగంలోని వివిధ విభాగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.

### గత పెట్టుబడులపై సమీక్ష

గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. పెట్టుబడుల అమలులో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులకు మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దేలా సమ్మిట్ ఏర్పాట్లు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిషేధిత భూములపై ఆందోళన వద్దు!

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం
- 14లోగా భూముల పత్రాలన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి
- సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు చెక్ : మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నేటిధాత్రి:
నిషేధిత ఆస్తుల జాబితా(పీఓబీ/22-ఎ)లో ఉన్న భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.
కొత్తగా ఎలాంటి భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని తెలిపారు. గతంలో ఉన్న చట్టపరమైన, సాంకేతిక సమస్యలను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పిస్తామని చెప్పారు.

### 14లోగా పత్రాల అప్‌లోడ్

భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ పత్రాలు, లేఅవుట్ అనుమతులు తదితర అన్ని పత్రాలను ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల నకిలీ పత్రాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రిజిస్ట్రేషన్ సమయంలో నిజమైన, నకిలీ పత్రాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.
పహాణీలను కూడా సబ్ రిజిస్ట్రార్లకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పెండింగ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు.

### ఆన్‌లైన్ వివరాల ఆధారంగానే నిర్ణయాలు

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకునేలా వారి అధికారాలను పరిమితం చేయాలని ఆదేశించారు.
ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఓబీకి సంబంధించిన ప్రతి దరఖాస్తును నేరుగా కలెక్టర్‌కు పంపాలని సూచించారు.
హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయాలపై చర్చించారు.



# యమపురికి రహదారిగా మారిన రాజీవ్ రహదారి?

నేటిధాత్రి exclusive



## రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యం పట్టింపులేని యంత్రాంగం

- రాజీవ్ రహదారిలో శామీర్ పేట వద్ద యూటర్న్, సర్వీసు రోడ్డు లేక పదేళ్లుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల తంతు
- ఆర్ అండ్ బి, మున్సిపల్, ట్రాఫిక్ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- ప్రయాణీకులకు శాపంగా మారిన శామీర్ పేట ప్రధాన చౌరస్తా
- రోడ్డు ప్రమాదాల చౌరస్తాకు తోడుగా వైన్స్ షాపుల ఏర్పాటుతో విచ్చలవిడిగా వాహనాల పార్కింగ్ తో మరిన్ని ప్రమాదాలు

"నేటిధాత్రి",శామీర్ పేట:
అసలే అది రాజీవ్ రహదారి స్టేట్ హైవే.. ఆ రోడ్డు ప్రయాణీకులకు ప్రమాద రహితంగా ఉండాలి... అయినా సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యం, పట్టింపు లేని మూలంగా గత పదేళ్ళుగా ఆ రోడ్డులో ప్రయాణీకులకు అవసరమైన యూటర్న్, సరైన సర్వీసు రోడ్డు లేని ఫలితంగా ఆ రోడ్డు ప్రయాణీకులకు శాపంగా మారింది. ఆ రోడ్డులో ప్రమాదాలు నిత్య కృత్యమవుతున్నాయి. సికింద్రాబాద్, జేబీఎస్ నుంచి శామీర్ పేట మీదుగా ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని మీదుగా మంచిర్యాల వరకు దాదాపు 200 కిలో మీటర్ల దూరం వరకు నాలుగు లైన్లతో గత 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రాజీవ్ రహదారి స్టేట్ హైవే రోడ్డును ఏర్పాటు చేసింది. ఈ రాజీవ్ రహదారి స్టేట్ హైవే గుండా ప్రజ్ఞాపూర్ సిద్దిపేట, హుస్నాబాద్, సిరిసిల్ల,కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, మంథని, రామగుండం, గోదావరిఖని, హుజురాబాద్ తదితర జిల్లాల కు చెందిన ప్రయాణీకులు

08 లో



## రేషన్ బియ్యం పక్కదారి!

- గ్రామాల్లో యథేచ్ఛగా కొనుగోళ్లు
- కిలోకు రూ.17 నుంచి రూ.19 వరకు చెల్లింపులు.. పట్టించుకోని అధికారులు?

కొడిమ్యాల, నేటిధాత్రి:
పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం



03 లో

పక్కదారి పడుతోందనే ఆరోపణలు కొడిమ్యాల మండలంలో వినిపిస్తున్నాయి. గ్రామాల్లో కొందరు వ్యక్తులు

# నీటి కొరత..ఎల్‌నినో ముప్పు!

## రైతు నెత్తిన ప్రకృతి పిడుగు.. సాగు నీరందక ఆందోళన.. వాతావరణ మార్పులతో పెరుగుతున్న అనిశ్చితి



ములుగు , నేటిధాత్రి:

పంట చేతిలోకి రావాలంటే ముందుగా నీరు కావాలి.. నీరు అందితేనే సాగు ముందుకు సాగుతుంది.లి కానీ మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న నీటి కొరత రైతు భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఒకవైపు భూగర్భ జలాలు పడిపోతుండటం.. మరోవైపు వర్షాలపై పెరుగుతున్న ఆధారపడటం.. ఇంకోవైపు ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాల ప్రభావం.. ఇవన్నీ కలిసి వ్యవసాయ రంగానికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి.

**వర్షం ఎప్పుడు పడుతుందో.. నీరు ఎప్పుడు వస్తుందో?**

రైతు సాగు ప్రణాళిక వేసుకునేది వర్షాల అంచనాతోనే. కానీ వర్షాలు సకాలంలో పడకపోవడం, పడాల్సిన సమయంలో పడకపోవడం, ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడం వంటి పరిణామాలు సాగు క్యాలెండర్‌ను తారుమారు చేస్తున్నాయి. వర్షాధార ప్రాంతాల్లో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతోంది. వర్షం ఆలస్యమైతే విత్తనం ఆలస్యం.. వర్షం ఎక్కువైతే పంట నష్టం.. వర్షం మధ్యలో ఆగిపోతే దిగుబడిపై ప్రభావం.

### రైతు చేతిలో విత్తనం ఉన్నా.. ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి తప్పడం లేదు.

**ఎల్‌నినో.. వాతావరణంలో మరో మలుపు**

సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులతో ఏర్పడే ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేయగల పరిణామం. దాని ప్రభావం ప్రాంతానికో విధంగా కనిపించినప్పటికీ.. వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వ్యవసాయ పరిస్థితుల్లో అనిశ్చితిని పెంచే అవకాశం ఉంటుంది. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులకు ఇటువంటి వాతావరణ మార్పులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. లివాతావరణం మారితే.. రైతు లెక్కలూ మారాల్సిందే.

**నీటి కోసం పోటీ.. పంట కోసం పోరాటం**

సాగునీటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. చెరువులు, కుంటలు, కాలువలు, భూగర్భ జలాలపై ఆధారపడే రైతులకు నీటి లభ్యత కీలకంగా మారింది. వర్షాలు తగ్గితే భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతుంది. బోర్లు మరింత లోతుకు వెళ్లాల్సి వస్తుంది. విద్యుత్ వినియోగం పెరుగుతుంది. పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది.

**నీరు తగ్గితే.. రైతు ఖర్చు పెరుగుతుంది.**

**బోరు లోతు పెరుగుతోంది.. భరోసా తగ్గుతోంది**

భూగర్భ జలాలపై ఆధారపడే రైతులకు బోరు తవ్వకం ఒక పెద్ద పెట్టుబడిగా మారుతోంది. బోరు పడుతుందో లేదో తెలియదు.. పడినా సరిపడా నీరు వస్తుందో లేదో తెలియదు. ఒకవైపు బోరు ఖర్చు.. మరోవైపు విద్యుత్ ఖర్చు.. చివరికి నీరు లేకపోతే మొత్తం పెట్టుబడే నష్టమవుతుంది.

### నీటిని వెతుక్కుంటూ రైతు అప్పుల బాట పట్టే పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉంది.

**పంటల ఎంపికలో నీరే కీలకం**

నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక జరగాలి. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రోత్సహించడం భవిష్యత్తులో సమస్యలను పెంచే అవకాశం ఉంది. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, స్థానిక వాతావరణానికి అనుకూలమైన రకాలు, సూక్ష్మ సేద్యం వంటి విధానాలపై రైతులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**వర్షం పడితే వరద.. పడకపోతే కరువు!**

వాతావరణ మార్పుల ప్రభావంతో వర్షపాతం స్వభావంలో మార్పులు కనిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో తక్కువ సమయంలో భారీ వర్షం.. ఆ తర్వాత సుదీర్ఘ విరామం.. ఇలా వర్షపాతం అసమతుల్యంగా మారితే వ్యవసాయానికి ఇబ్బందులు తప్పవు.

### నీరు వచ్చినప్పుడు నిల్వ చేయలేకపోతే.. నీరు లేనప్పుడు దాని కోసం వెతకాల్సిందే.

**చెరువులు నిండితేనే భరోసా**

గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, కాలువలు, చిన్న నీటి వనరుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను రీచార్జ్ చేయడం, నీటి వినియోగంలో పొదుపు పాటించడం ద్వారా భవిష్యత్తు నీటి సంక్షోభాన్ని కొంతవరకు తగ్గించే అవకాశం ఉంటుంది.

**నీటి నిర్వహణే భవిష్యత్తు వ్యవసాయానికి కీలకం**

కేవలం సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం మాత్రమే కాకుండా.. అందుబాటులో ఉన్న ప్రతి నీటి బొట్టును సమర్థంగా వినియోగించే విధానం అవసరం. చెరువు నుంచి పొలానికి.. పొలం నుంచి పంటకు.. పంట నుంచి మార్కెట్ వరకు నీరు, పెట్టుబడి, దిగుబడి, ధరల మధ్య సమతుల్యత ఉండాలి.

**వాతావరణ సమాచారం రైతు చేతిలో ఉండాలి**

వర్షాలు ఎప్పుడు వచ్చే అవకాశం ఉంది? ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పులు ఉండొచ్చు? పంటకు అనుకూల పరిస్థితులు ఎప్పుడు ఉంటాయి? వంటి సమాచారాన్ని రైతుకు సకాలంలో అందించాలి. వాతావరణ హెచ్చరికలు రైతు మొబైల్ వరకు చేరితే.. విత్తన ఎంపిక నుంచి సాగు పద్ధతుల వరకు నిర్ణయాలు మార్చుకునే అవకాశం ఉంటుంది.

**బీమా.. రక్షణ కవచంగా మారాలి**

వాతావరణ మార్పులతో పంట నష్టపోతే రైతుకు పంట బీమా అండగా నిలవాలి. నష్టాన్ని అంచనా వేయడంలో జాప్యం లేకుండా.. పరిహారం సకాలంలో అందేలా వ్యవస్థ పనిచేయాలి. వాతావరణం రైతు చేతిలో లేకపోవచ్చు.. కానీ నష్టపోయిన రైతును ఆదుకునే వ్యవస్థ మాత్రం మన చేతిలోనే ఉంది.

**నీరు లేకుండా వ్యవసాయం.. రైతు లేకుండా ఆహార భద్రత**

వ్యవసాయానికి నీరు ప్రాణాధారం. నీటి లభ్యత తగ్గితే పంటల సాగు తగ్గుతుంది. సాగు తగ్గితే రైతు ఆదాయం



ప్రభావితమవుతుంది. చివరికి ఆహార సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

అందుకే నీటి సమస్యను కేవలం రైతు సమస్యగా కాకుండా లిఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన అంశంగాలి చూడాల్సిన అవసరం ఉంది.

**ఇక ముందున్న సవాల్ ఇదే!**

**వర్షాలు ఎప్పుడు పడతాయో రైతు నిర్ణయించలేడు. ఎల్‌నినో ప్రభావం ఎలా ఉంటుందో రైతు నియంత్రించలేడు.**

**కానీ పడిన ప్రతి నీటి బొట్టును నిల్వ చేయడం.. భూగర్భ జలాలను కాపాడడం.. నీటి వినియోగాన్ని సమర్థవంతం చేయడం.. వాతావరణ సమాచారాన్ని రైతుకు చేరవేయడం మాత్రం సాధ్యమే.**

**నీటి కొరతను ముందే గుర్తించి..వాతావరణ మార్పులను అంచనా వేసి..పంటల సాగును అందుకు అనుగుణంగా మార్చే సమగ్ర విధానం అవసరం**





# రేషన్ బియ్యం పక్కదారి!

## కిలోకు రూ.17 నుంచి రూ.19 వరకు చెల్లింపులు.. పట్టించుకోని అధికారులు?

కొడిమ్యాల, నేటిధాత్రి:

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోందనే ఆరోపణలు కొడిమ్యాల మండలంలో వినిపిస్తున్నాయి. గ్రామాల్లో కొందరు వ్యక్తులు ఆటోలు, టాలీలు, ద్విచక్ర వాహనాలకు మైకులు ఏర్పాటు చేసుకుని కూరగాయలు విక్రయించిన మాదిరిగా ఇంటింటికీ తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

కిలో రేషన్ బియ్యానికి రూ.17 నుంచి రూ.19 వరకు చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారని, మైకుల్లో బియ్యం కొనుగోలు చేస్తామని ప్రచారం చేస్తూ గ్రామాల్లో యథేచ్ఛగా తిరుగుతున్నా సంబంధిత అధికారుల దృష్టికి ఈ వ్యవహారం చేరడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**మూడు నెలల బియ్యంతో మరింత జోరు**

మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో అక్రమ కొనుగోళ్లు మరింత పెరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రేషన్ బియ్యం నిల్వలు, అక్రమ తరలింపుపై అధికారులు నిఘా పెట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోళ్లపై తనిఖీలు నిర్వహించాలని, అక్రమంగా బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కత్తి వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించిన గోపా నాయకులు

**భవాని గౌడ్ దశదిన కార్యక్రమంలో పాల్గొని నివాళులు**



హైదరాబాద్,నేటిధాత్రి:

తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, ప్రొఫెసర్ డాక్టర్ కత్తి వెంకటస్వామి గౌడ్ సతీమణి భవాని గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె దశదిన కార్యక్రమాన్ని హైదరాబాద్ అంబర్‌పేటలోని శ్రీ మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గోపా అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్, రాష్ట్ర గోపా ఆర్గనైజేషన్ కార్యదర్శి ఏలమకట్టి మీరయ్య గౌడ్, వరంగల్ జిల్లా గోపా అసోసియేషన్ అధ్యక్షుడు రామగోని సుధాకర్ గౌడ్ హాజరయ్యారు. భవాని గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కత్తి వెంకటస్వామి గౌడ్, ఆయన కుమారుడు వెంకట చాణక్య గౌడ్, కుమార్తె వెంకట అక్షిత గౌడ్ లను పరామర్శించి, భవాని గౌడ్ మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్, గౌడ సంఘం నాయకులు మొగుల్ల అశోక్ కుమార్ గౌడ్, పల్లె రామచందర్ గౌడ్, నర్సంపేట గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు గిరగానీ సాంబయ్య గౌడ్, నాసగోని రాజయ్య గౌడ్ తో పాటు గోపా నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 8న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ



నర్సంపేట,నేటిధాత్రి:

సెప్టెంబరు 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ వరంగల్ జిల్లా ఇన్‌చార్జి వంగూరి ఆనందరావు మాదిగ పిలుపునిచ్చారు. నర్సంపేటలోని ఎస్ఆర్ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ వరంగల్ జిల్లా సహ ఇన్‌చార్జి చింతం సిద్దు మాదిగ సమన్వయంతో సమావేశం జరిగింది. అతిథులుగా వంగూరి ఆనందరావు మాదిగ,ఎంఎస్‌పీ మాజీ జిల్లా అధ్యక్షుడు కళ్లపెల్లి ప్రణయ్‌కుమార్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ.. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మంద కృష్ణ మాదిగ మాదిగ సామాజిక వర్గానికి చెందినప్పటికీ, ఆయన చేసిన పోరాటాలు అన్ని పేద, బడుగు వర్గాల సంక్షేమం కోసమేనన్నారు. ఆరోగ్యశ్రీ పథకం, పేదలకు పింఛన్లు, రేషన్ బియ్యం కోటా పెంపు తదితర అంశాలపై పోరాటాలు చేసి ఫలితాలు సాధించామని తెలిపారు. వాటి ప్రయోజనాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, పేద అగ్రవర్ణ వర్గాల ప్రజలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

**ఎంఎస్ఎఫ్ నూతన కళాశాల కమిటీ ఏర్పాటు**

అనంతరం మాదిగ విద్యార్థి సమాఖ్య నూతన కళాశాల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఈ. వికాస్ మాదిగ, అధికార ప్రతినిధిగా ఎస్. సాత్విక్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బి. మున్నా మాదిగను నియమించారు. ఉపాధ్యక్షులుగా కే. ప్రణీత్ మాదిగ, చి. సంజయ్ మాదిగ, ఏ. శ్రీహరిషిత్ మాదిగ, పి. చరణ్ మాదిగ, పి. శివశంకర్ మాదిగ, జె. చందు మాదిగలను ఎంపిక చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎం. సిరివల్లిక మాదిగ, అధికార ప్రతినిధిగా ఎం. రేష్మిక మాదిగ, సభ్యురాలిగా కొమ్ముక. ప్రణీత మాదిగను నియమించారు. కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గీత వృత్తితో సంబంధం లేనివారికి టీఎఫ్‌టీ లైసెన్సులా?

- నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తులు.. అడ్డుకోవాలని అధికారులకు వినతి
- గీత కార్మికుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి




నిజామాబాద్, నేటిధాత్రి:

గీత వృత్తితో సంబంధం లేని ఇతర కులాలకు చెందిన వ్యక్తులకు టీఎఫ్‌టీ లైసెన్సులు మంజూరు చేయవద్దని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కోటగిరి అరుణ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అమలు విభాగం సహాయ కమిషనర్ డి.అరుణ్‌కుమార్, ఎక్సైజ్ సీఐ స్వప్నను కలిసి వినతిపత్రం అందజేశారు.

నవీపేట మండలం జన్నపల్లి గ్రామంలో గీత వృత్తితో సంబంధం లేని కొంతమంది వ్యక్తులు టీఎఫ్‌టీ లైసెన్సుల కోసం అక్రమంగా దరఖాస్తు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అరుణ్‌గౌడ్ తెలిపారు. నిబంధనలను పరిశీలించి అర్హత లేని వారికి లైసెన్సులు మంజూరు చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఇప్పటికే ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా టీఎఫ్‌టీ లైసెన్సులు పొందితే వాటిని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. గీత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న పేద గౌడ కుటుంబాల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో మోకుదెబ్బ ప్రధాన కార్యదర్శి మెరుగు, ఉపాధ్యక్షులు బొజ్జ చిన్నగౌడ్, సూదుల భూమేష్‌గౌడ్, అధికార ప్రతినిధి వేంపల్లి సంతోష్‌గౌడ్, వేంపల్లి ఉపేందర్‌గౌడ్, తమ్ముని సాగర్‌గౌడ్, ఉడుతల రాజుగౌడ్, ఉడుతల శ్రీనివాస్‌గౌడ్, మల్లెపూల నాగేష్‌గౌడ్, సాయికుమార్, సతీష్‌గౌడ్ తదితర జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించి ఏడాది.. ఇంకా ఖాళీగానే!

- అర్హులకు అందాల్సిన ఇళ్లు.. అనర్హుల చేతుల్లోనేనా?
- సింగరేణి క్వార్టర్స్‌లో ఉంటున్న లబ్ధిదారులపై ప్రశ్నలు...
- ఏడాది గడిచిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు చేరని లబ్ధిదారులు..



రామకృష్ణాపూర్, నేటిధాత్రి:

పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కొన్నింటి పరిస్థితి ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రామకృష్ణాపూర్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గత ఏడాది లబ్ధిదారులకు కేటాయించినప్పటికీ, సంవత్సరం గడిచినా సుమారు సగం మంది లబ్ధిదారులు ఇంకా ఇళ్లలోకి పూర్తిగా వెళ్లలేదని స్థానికులు చెబుతున్నారు.

**ఇల్లు వచ్చే వరకు పైరవీలు.. వచ్చాక నిర్లక్ష్యమా?**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కేటాయింపుల సమయంలో తీవ్రంగా ప్రయత్నాలు చేసిన కొందరు లబ్ధిదారులు, ఇళ్లు వచ్చిన తర్వాత వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పేదలకు అందించాల్సిన ఉచిత గృహాలను ఖాళీగా ఉంచడం వల్ల అసలు అవసరమైన కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సింగరేణి క్వార్టర్స్‌లో ఉంటూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు..**

మరోవైపు రామకృష్ణాపూర్‌లోని సింగరేణి క్వార్టర్స్‌లో ఇప్పటికే నివాసం ఉంటున్న కొంతమందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా కేటాయించబడ్డాయని స్థానికులు పేర్కొంటున్నారు. రెండు చోట్ల నివాస సదుపాయం ఉన్న పరిస్థితుల్లో నిజంగా ఇల్లు లేని కుటుంబాలకు అవకాశం దక్కకుండా పోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక సింగరేణి క్వార్టర్స్‌లో ఉంటూనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పొందిన కొందరు లబ్ధిదారులు వాటిని భవిష్యత్తులో అద్దెకు ఇస్తారా? లేక సింగరేణి క్వార్టర్స్‌ను అద్దెకు ఇస్తారా? అంటూ పట్టణ ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

**అర్హులను గుర్తించి ఇళ్లు కేటాయించాలని డిమాండ్**

పూర్తిగా ఇల్లు లేని పేద కుటుంబాలను అధికారులు గుర్తించి, ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వారికి కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే సింగరేణి క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు పొందిన లబ్ధిదారుల అర్హతను కూడా అధికారులు పునఃపరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఖాళీగా ఉంచితే కఠిన చర్యలు తీసుకోవాలి**

ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన ఇళ్లు ఖాళీగా ఉండటం సరికాదని, లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలో వారు తప్పనిసరిగా నివాసం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు. కేటాయించిన ఇళ్లలో నివాసం ఉండని వారు ఉంటే నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న ఇతర నిరుపేద కుటుంబాలకు వాటిని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సొంతింటి కలను సాకారం చేయాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఖాళీగా ఉండకుండా.. నిజమైన అర్హులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా స్థానిక మున్సిపల్ పాలకవర్గం, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.




**ఇళ్లలోకి రాకుంటే పట్టాలు రద్దు..**

**మందమర్రి ఎమ్మార్వో సతీష్‌కుమార్...**

అర్హులైన పేదవారికి ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో లబ్ధిదారులు తప్పనిసరిగా నివాసం ఉండాలని మందమర్రి ఎమ్మార్వో సతీష్‌కుమార్ తెలిపారు. ఇళ్ల పట్టాలు పొంది సంవత్సర కాలం గడిచినా ఇప్పటివరకు ఇళ్లలోకి ప్రవేశించని లబ్ధిదారులను గుర్తించి, వారి పట్టాలను రద్దు చేయనున్నట్లు స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు పొందిన వారు 10 రోజుల్లోగా తమకు కేటాయించిన ఇళ్లలోకి చేరి నివాసం ఉండాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఇళ్లలోకి ప్రవేశించని వారి పట్టాలను రద్దు చేసి, ఆ ఇళ్లను నిజంగా అవసరమున్న అర్హులైన పేదలకు కేటాయిస్తామని ఎమ్మార్వో వెల్లడించారు....




**ఇండ్లను వినియోగించుకోకుండా ఉంచడం సరికాదు ...**

**మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి-రాజా రమేష్.**

ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులు వినియోగించుకోకుండా ఖాళీగా ఉంచడం సరికాదన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి- రాజా రమేష్ తెలిపారు.

# బాలాజీ టెక్నో స్కూల్ లో' హర్ ఘర్ తిరంగా'వేడుకలు

నర్సంపేట, నేటిధాత్రి:

నర్సంపేట మండలం లక్నేపల్లి శివారులో గల బాలాజీ టెక్నో స్కూల్ లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరవేయాలని కోరుతూ విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో ర్యాలీ చేసి జాతీయ ఐక్యతను చాటారు. ప్రిన్సిపల్ పి. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని ,జాతీయ జెండాపై గౌరవాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.



# ఫలించిన బీఆర్ఎస్ పోరాటం!

●గణపురం చెరువు తూములు తెరవడంపై బీఆర్ఎస్ నేతల హర్షం

●సాగునీటికి మళ్లీ ఆటంకం కలిగిస్తే పోరాటం తప్పదు : పోలుసాని లక్ష్మీనరసింహారావు



గణపురం, నేటిధాత్రి:

గణపురం చెరువుకు సాగునీటి విడుదల కోసం బీఆర్ఎస్ పార్టీ చేసిన పోరాటం ఫలించిందని భూపాలపల్లి మాజీ మార్కెట్ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గణపురం చెరువు తూముల వద్ద నీటి విడుదలను పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలుసాని లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రభుత్వంపై, నీటిపారుదల శాఖ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతోనే గణపురం చెరువు కాలువల తూములు తెరిచారని తెలిపారు. ఇకనైనా కాలువల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

### రామప్ప నుంచి గణపురం చెరువుకు నీరు

రామప్ప చెరువుకు దేవాదుల ద్వారా వచ్చే నీటిని గురుత్వాకర్షణ కాలువ ద్వారా గణపురం చెరువుకు తరలించి నింపాలని ఆయన కోరారు. గతంలో గండ్ర వెంకటరమణారెడ్డి చొరవతో రామప్ప నుంచి గణపురం చెరువుకు నేరుగా గురుత్వాకర్షణ కాలువ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి, పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేయించారని పేర్కొన్నారు.

అయితే ప్రస్తుత ఎమ్మెల్యే ఆ పనిని పక్కన పెట్టడంతోనే గణపురం చెరువుకు నీటి సమస్య ఏర్పడిందని ఆయన ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గతంలో చేపట్టిన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై విమర్శలు

గణపురం చెరువు నుంచి అన్ని మండలాలకు తాగునీరు అందిస్తున్నందునే సమస్య ఏర్పడిందని కొందరు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వారి అవగాహన రాహిత్యాన్ని తెలియజేస్తున్నాయని పోలుసాని విమర్శించారు. అన్ని మండలాలకు తాగునీరు అందించడంతో పాటు చెరువు ఎప్పుడూ నీటితో నిండుగా ఉండేలా గతంలో రామప్ప నుంచి గురుత్వాకర్షణ కాలువ ద్వారా నీటిని తరలించే ఏర్పాట్లు చేశారని తెలిపారు.

గతంలో కరోనా సమయంలో యాసంగి పంటలకు నీరు అందించేందుకు ఇబ్బందులు ఉన్నప్పటికీ రామప్ప చెరువు నుంచి గురుత్వాకర్షణ కాలువ ద్వారా గణపురం చెరువును నింపి రైతుల పట్ల గండ్ర వెంకటరమణారెడ్డి తన చిత్తశుద్ధిని చాటుకున్నారని అన్నారు.

### మళ్లీ అడ్డుకుంటే పోరాటం

రైతులకు సాగునీటి విడుదల విషయంలో మళ్లీ ఎలాంటి ఆటంకాలు సృష్టించినా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముందుండి పోరాటం చేస్తామని పోలుసాని లక్ష్మీనరసింహారావు హెచ్చరించారు. రైతులకు సాగునీరు అందే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరుశురాంపల్లి సర్పంచ్ ఉడుత సాంబయ్య యాదవ్, మాజీ సర్పంచ్ కట్ల శంకరయ్య, మాజీ గ్రామశాఖ అధ్యక్షులు హఫీజ్, చెన్నాబోయిన కృష్ణ, సీనియర్ నాయకులు మామిండ్ల సాంబయ్య యాదవ్, గాజర్ల చింటూ గౌడ్, బోట్ల స్వామి, పాశికంటి రామకృష్ణ, పబ్బ రవీందర్, వేల్పుల రాజయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

●ఆగస్టు 13న భారీ తిరంగా యాత్ర

●ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి : సిరికొండ బలరాం



ములుగు టౌన్, నేటిధాత్రి:

'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా ఆగస్టు 13న ములుగు పట్టణంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం తెలిపారు. ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. దేశ ఐక్యతను చాటేలా ములుగు నుంచి తిరంగా సందేశాన్ని రాష్ట్రవ్యాప్తంగా వినిపిద్దామని అన్నారు. కార్యక్రమంలో భూక్యా జవహర్‌లాల్, శ్రీలమంతుల రవీంద్రాచారి, జాడి వెంకట్, నగరపు రమేశ్, భూక్యా రాజునాయక్, జినుకల కృష్ణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవాగు నీటితో నాలుగు గ్రామాలు సస్యశ్యామలం!

మొగుళ్లపల్లి, నేటిధాత్రి:



మొగుళ్లపల్లి మండలం ఇసిపేట వద్ద ప్రవహిస్తున్న పెద్దవాగు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు లిఫ్ట్ పథకం మంజూరు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఇసిపేట, పాత ఇసిపేట, చింతలపల్లి, రంగాపురం గ్రామాల పరిధిలో సాగునీరు లేక వేలాది ఎకరాల భూములు బీడుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారంతో ఇసిపేట సర్పంచ్ యార ముకుందరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దవాగు నుంచి లిఫ్ట్ పంప్‌సెట్‌కు తక్షణ అనుమతి ఇచ్చి సాగునీరు అందించాలని కోరారు. పథకం అమలైతే నాలుగు గ్రామాల్లో వేలాది ఎకరాలకు నీరందడంతో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు. వ్యవసాయ పెట్టుబడి తగ్గి రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుజాత సంజీవరెడ్డి, గ్రామ పెద్దలు కిరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, రామ్‌రెడ్డి, సాయిరెడ్డి, వేణు, తిరుపతి, రాయమల్లు, మైపాల్, గాజుల పరశురాములు, మేడిద ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ డెలివరీ రంగంలో మంచి ఉపాధి

●ఉపాధి కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు.. మీ ప్రాంతంలోనే అవకాశాలు

●నెలకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు సంపాదించే అవకాశం : హెచ్ఆర్ భాస్కర్



కేసముద్రం, నేటిధాత్రి:

ఉపాధి కోసం యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానికంగానే ఆన్‌లైన్ డెలివరీ రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని సంస్థ హెచ్ఆర్ భాస్కర్ తెలిపారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన డెలివరీ సంస్థలో డెలివరీ ఏజెంట్లుగా పనిచేయడానికి యువతకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

డెలివరీ ఏజెంట్‌గా పనిచేసే వారికి నెలకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు సంపాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్‌గా పనిచేసే వెసులుబాటు ఉందన్నారు. డెలివరీ బాయ్‌గా చేరాలనుకునేవారు సొంత ద్విచక్ర వాహనం, స్మార్ట్‌ఫోన్ కలిగి ఉండాలని సూచించారు.

### విద్యార్థులకు అనుకూలం

చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువత ఖాళీగా ఉండకుండా తక్షణ ఉపాధి పొందేందుకు ఈ రంగం ఉపయోగపడుతుందని భాస్కర్ పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత తమకు అనుకూలమైన సమయంలో రోజుకు మూడు నుంచి ఆరు గంటలు పనిచేసి సొంత ఖర్చులను భరించవచ్చన్నారు.

### నైపుణ్యాలకూ ఉపయోగం

డెలివరీ రంగంలో పనిచేయడం ద్వారా వివిధ రకాల వ్యక్తులతో మాట్లాడటం, పటాలను ఉపయోగించడం, సమయపాలన, ఒత్తిడిని ఎదుర్కోవడం వంటి నైపుణ్యాలు అలవడతాయని తెలిపారు. ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరుగుతున్న నేపథ్యంలో వస్తువులను వినియోగదారులకు సకాలంలో చేరవేయడంలో డెలివరీ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు.

### చదువుతో పాటు ఉపాధి

యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబంపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించవచ్చని భాస్కర్ తెలిపారు. పార్ట్‌టైమ్‌గా పనిచేస్తూ చదువు, పోటీ పరీక్షల శిక్షణ కొనసాగించడంతో పాటు ఫీజులు, వ్యక్తిగత ఖర్చులను తామే భరించుకునే అవకాశం ఉంటుందన్నారు. రోజులో కొంత సమయం డెలివరీ పనికి కేటాయించి, మిగిలిన సమయాన్ని చదువుకు వినియోగిస్తే ఉద్యోగంతో పాటు భవిష్యత్ లక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు.

# పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరెంటు కష్టాలపై ఎమ్మెల్యే సీరియస్!



●విద్యుత్ సమస్యపై అధికారుల తీరుపై ఆగ్రహం

●కలెక్టర్ దృష్టికి సమస్య.. వైరింగ్ పనులకు రూ.4 లక్షలు మంజూరు చేయాలని విజ్ఞప్తి

●నిధులు విడుదలైన వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశం

పటాన్‌చెరు, నేటిధాత్రి:

పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విద్యుత్ సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్న ఘటనపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి (జీఎంఆర్) తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆస్పత్రి ఆర్ఎంవో శ్రీనివాస్, వైద్యులు, ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. సోమవారం ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు జనరేటర్ పనిచేయక రోగులు, వారి సహాయకులు ఎదుర్కొన్న ఇబ్బందులపై అధికారులను ఆరా తీశారు.

### విషయం నా దృష్టికి ఎందుకు రాలేదు?

విద్యుత్ సమస్య తలెత్తినా, జనరేటర్ పనిచేయకపోయినా తన దృష్టికి విషయం ఎందుకు తీసుకురాలేదని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. అత్యవసర వైద్య సేవలు అందించే ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం ఏర్పడటం, ప్రత్యామ్నాయంగా ఉండాల్సిన జనరేటర్ కూడా పనిచేయకపోవడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు.

### వైరింగ్‌కు రూ.4 లక్షలు

ఆస్పత్రి మొత్తం విద్యుత్ వైరింగ్‌ను మార్చేందుకు సుమారు రూ.4 లక్షలు అవసరమవుతాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే స్పందించిన జీఎంఆర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆస్పత్రి వైరింగ్ పనులకు అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నిధులు విడుదలైన వెంటనే వైరింగ్ పనులు ప్రారంభించి విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

### జనరేటర్ అందుబాటులో ఉండాలి

కరోనా సమయంలో సీఎస్ఆర్ నిధులతో ఆస్పత్రికి జనరేటర్ ఏర్పాటు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అత్యవసర సమయాల్లో రోగులకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించేందుకు జనరేటర్‌ను పూర్తిస్థాయిలో పనిచేసేలా అందుబాటులో ఉంచాలని సూచించారు.

### త్వరలో అభివృద్ధి కమిటీ సమావేశం

పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించేందుకు త్వరలో ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం, నాణ్యమైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని జీఎంఆర్ స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# హక్కులతో పాటు బాధ్యతలూ తెలుసుకోవాలి



●స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

●దేశాభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలి : వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

హనుమకొండ, నేటిధాత్రి:

రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా తమ బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశాభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ వరంగల్ క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'పై రెండు రోజుల సమగ్ర సమాచార, ప్రజా అవగాహన కార్యక్రమం, ఛాయాచిత్ర ప్రదర్శనను మంగళవారం పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ప్రారంభించారు.

### హక్కులతో పాటు బాధ్యతలూ ముఖ్యం

ఛాయాచిత్ర ప్రదర్శన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హక్కుల కోసం పోరాడటం ఒక వైపు అయితే.. పౌరులుగా మన బాధ్యతలను నిర్వర్తించడం మరో వైపు అని పేర్కొన్నారు.

మనకు లభించిన స్వాతంత్ర్యాన్ని గౌరవిస్తూ, దాని విలువను కాపాడుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి సమాజాన్ని అందించాలనేది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేశాభివృద్ధి భవిష్యత్ తరాల యువతపై ఆధారపడి ఉందని, యువత తమ జీవితాలను ఏ విధంగా మలుచుకోవాలనేది వారి చేతుల్లోనే ఉందన్నారు. కష్టపడి తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

### స్వేచ్ఛ వెనుక త్యాగాలను మరవొద్దు

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ.. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం జరిగిన త్యాగాలు, పోరాటాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని సూచించారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం అదృష్టమని, గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మనకు లభించిన అపూర్వ అవకాశం అన్నారు. ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక విధులు కూడా రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేశారు.

ప్రతి ఏడాది ఆగస్టు 15, జనవరి 26 వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు స్వాతంత్ర్యం వెనుక ఉన్న కృషి, త్యాగాలు, పోరాటాలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నేడు మనం చూస్తున్న జాతీయ పతాకం ఒక్క రోజులో రూపుదిద్దుకోలేదని, దాని వెనుక ఎన్నో సంవత్సరాల కృషి, పోరాటం ఉందన్నారు.

### విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశం పట్ల బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. 'హర్ ఘర్ తిరంగా'పై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాబృందాలు ప్రదర్శించిన 'హర్ ఘర్ తిరంగా' యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, కార్యక్రమ ఇన్‌చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్ లో పని చేసే నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలి



●నర్సుల హక్కుల కోసం ప్రైవేట్ హాస్పిటల్స్ తో ప్రభుత్వం చర్చించాలి

●తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నేటిధాత్రి:

ప్రైవేట్ హాస్పిటల్స్ లో పనిచేసే నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవటం బాధకరమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తనను కలిసిన ప్రైవేట్ హాస్పిటల్స్ నర్సులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు పెద్ద ఎత్తున ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయని.. అయినా ఆయా హాస్పిటల్స్ లో పనిచేసే సిబ్బందికి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ వాళ్లకు లేకపోవడం సరికాదన్నారు. వెంటనే ఈ విషయంపై ప్రభుత్వం ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో చర్చించి వారికి ఇన్సూరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పనివేళలు, జీతాలు, ఓవర్ టైమ్ వంటి అంశాల్లో తెలంగాణాకు చెందిన ఉద్యోగులను ఇబ్బంది పెడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోని ప్రైవేట్ హాస్పిటల్స్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ లో పనిచేసే సిబ్బందికి, నర్సులకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# హర్ ఘర్ తిరంగాతో 'వికసిత్ భారత్' సంకల్పాన్ని చాటుదాం



గణపురం, నేటిధాత్రి:

'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంతో 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ ఉమ్మడి కట్టుబాటును చాటాలని రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు దుప్పటి భద్రయ్య పిలుపునిచ్చారు. గణపురం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన భారీ తిరంగా యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ.. జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరికీ నిరంతరం స్ఫూర్తిని అందించే శక్తి అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోట్లాది మంది ప్రజలను భాగస్వాములను చేస్తూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని గుర్తుచేశారు.

### దేశభక్తిని చాటే మహాయజ్ఞం

ఈ ఏడాది కూడా 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా తిరంగా యాత్రలు నిర్వహించి దేశభక్తిని చాటాలని భద్రయ్య కోరారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో ప్రతి పౌరుడు తన వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాకానికి గౌరవం ఇవ్వడంతో పాటు దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. దేశభక్తిని చాటే ఈ మహాయజ్ఞంలో విద్యార్థులు, యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో గణపురం మండల ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి శివనాత్రి వేణు, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుప్పటి భద్రయ్య, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మంద మహేష్, సీనియర్ నాయకులు మాదాసు మొగిలి, మాడిశెట్టి సాంబశివుడు, సోమ దామోదర్, ఒద్దుల రాందాస్, మహిళా మోర్చా నాయకురాలు బొల్లం అరుణ, గొర్రె రవి, జన్నె ప్రశాంత్, ల్యాదల్ల నరేష్, వేముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధన ప్రచురణ నైతికతపై గీతం ప్రొఫెసర్ మార్గదర్శనం

●నైతిక పరిశోధన, శాస్త్రీయ ప్రచురణల్లో సమగ్రతపై అవగాహన

●సాహిత్య చోరీ నివారణ, పీర్ రివ్యూ, బాధ్యతాయుత పరిశోధనపై సూచనలు



పటాన్‌చెరు, నేటిధాత్రి:

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సీఎస్ఈ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ మహారాష్ట్రలోని కొల్హాపూర్ డి.వై. పాటిల్ వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఒకరోజు అధ్యాపక వికాస కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్నారు. 'పరిశోధన ప్రచురణ నైతికత' అంశంపై ఆమె అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.

న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నైతిక పరిశోధన, విద్వత్ ప్రచురణల ప్రాధాన్యాన్ని ప్రొఫెసర్ పర్వేకర్ వివరించారు. పరిశోధన సమగ్రత, ప్రచురణ నైతికత, సాహిత్య చోరీ నివారణ, పీర్ రివ్యూ విధానం, బాధ్యతాయుత పరిశోధన ప్రవర్తన, నాణ్యమైన పరిశోధన ప్రచురణకు అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులపై అవగాహన కల్పించారు.

### నైతిక ప్రమాణాలపై చర్చ

కార్యక్రమంలో అధ్యాపక సభ్యులు, పరిశోధనా పండితులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యా పరిశోధనలో ఉన్నత నైతిక ప్రమాణాలను పాటించడం, శాస్త్రీయ ప్రచురణల్లో



సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాలపై ప్రొఫెసర్ పర్వేకర్‌తో చర్చించారు.

ఈ కార్యక్రమం ద్వారా పరిశోధనలో నైతిక విలువల ప్రాధాన్యంపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి అధ్యాపక వికాస కార్యక్రమాలు నైతిక పరిశోధన పద్ధతులను బలోపేతం చేయడంతో పాటు జ్ఞాన వినిమయాన్ని ప్రోత్సహిస్తాయని, సహకార అభ్యాసం ద్వారా విద్యా నైపుణ్యాలను పెంపొందిస్తాయని ప్రొఫెసర్ పర్వేకర్ పేర్కొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సంగ్రామ్ పాటిల్, నిర్వాహక కమిటీ సభ్యులు, పాల్గొన్న వారందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# వర్షాభావంలోనూ 15% వృద్ధే లక్ష్యం!

అమరావతి, నేటిధాత్రి:
సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రం 15 శాతం వృద్ధిరేటు సాధించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వర్షాల లోటు కారణంగా ప్రజలపై అదనపు ధరల భారం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరు, నెలవారీ ఆర్థిక ప్రగతిపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఎల్‌నినోను ఎదుర్కొంటూ వృద్ధి

2026 జూలై ఆర్థిక నివేదికను పరిశీలించిన సీఎం.. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా నీటి లభ్యత, వ్యవసాయ ఉత్పత్తుల విలువ జోడింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. 2025-26 రెండో త్రైమాసికంలో రాష్ట్రం 10.7 శాతం వృద్ధిరేటు సాధించిందని అధికారులు సీఎంకు వివరించారు. వాస్తవ వృద్ధిరేటు 9.9 శాతంగా నమోదైందన్నారు. వ్యవసాయ రంగంలో 13.5 శాతం, పారిశ్రామిక రంగంలో 10.6 శాతం, సేవల రంగంలో 9.9 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు.

### జీఎస్టీ వసూళ్లు పెరుగుదల

సాంకేతికత అనుసంధానంతో జీఎస్టీ వసూళ్లు 21 శాతం పెరిగి రూ.13,282 కోట్లకు చేరినట్లు అధికారులు తెలిపారు. సాధారణ ఎగుమతులు రూ.16,322 కోట్లకు చేరగా, ఎస్‌టీపీఐ ఎగుమతుల్లో 32.2 శాతం వృద్ధి నమోదైందన్నారు. వాణిజ్య వాహనాల నమోదులో 51.6 శాతం వృద్ధి సాధించినట్లు వివరించారు. రూ.2.88 లక్షల కోట్ల విలువైన భారీ, మెగా ప్రాజెక్టుల గ్రౌండింగ్‌లో గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 51.8 శాతం లోటు వర్షపాతం నమోదైనప్పటికీ ఆర్థిక వ్యవస్థ సానుకూల వృద్ధిని కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

### ప్రజలే భాగస్వాములు

'పార్ట్నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర' లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తే ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి లభించిన స్పందనే నిదర్శనమన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలుస్తారని చెప్పారు.

### గుంతల రోడ్లకు తక్షణ మరమ్మతులు

రాష్ట్రంలో గుంతలు పడిన రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని సీఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం రానున్న రోజుల్లో మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావాన్ని అవకాశంగా మలుచుకుని వృద్ధి లక్ష్యాలను సాధించాలి.. ప్రజలపై భారం లేకుండా అభివృద్ధి కొనసాగాలి.. ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని చేరుకోవాలి అని సీఎం స్పష్టం చేశారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



సిరిసిల్ల టౌన్, నేటిధాత్రి:
సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితెతో కలిసి కలెక్టర్ మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.
వేడుకల వేదిక, జెండా ఆవిష్కరణ, స్టాల్స్, శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రముఖులు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వ్యక్తులు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు వేడుకల్లో పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి మిత్రబృందం ఆర్థిక సహాయం -క్వింటాబియ్యం అందజేత



శాయంపేట, నేటిధాత్రి:
శాయంపేట మండలం పెద్దకొడపాక గ్రామంలోని పాఠశాలలో చదువుకున్న మేము ఉన్నామని భరోసాతో పూర్వ విద్యార్థులు 1996-- 97లో చదువుకు న్న విద్యార్థులు. గత 20 ఏళ్లుగా తమతో చదువు కున్న మిత్రులు ఎవరైనా ఆపదలో ఉంటే తమవంతు సహాయ సహ కారాలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా తమ తోటి మిత్రురాలు ఏదుల శ్రీలత తండ్రి ఇటీవల అకాల మరణం చెందడంతో ఆమె కుటుంబాన్ని మిత్రులంతా పరామర్శించారు. శ్రీలతను ఓదార్చి, కుటుంబానికి అండగా నిలిచారు. తమ వంతు సహాయంగా ఒక క్వింటా బియ్యాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ పాఠశాలలో కలిసి చదు వుకున్న తమ మిత్రులంద రికీ ఆపద సమయంలో అండగా నిలుస్తూ,ఒకరికి ఒకరం సహాయ సహకా రాలు అందించుకుంటు న్నామని తెలిపారు. మి త్రుల ఐక్యతను, సేవాభా వాన్ని గ్రామస్తులు అభి నందించారు. ఈ కార్యక్ర మంలో స్నేహితులు ప్రజలు పాల్గొన్నారు

# భయాందోళనల మధ్య భారత్ మెస్?

## అన్నం తినేందుకూ అడ్డంకులేనా..?

## జాయింట్ ప్యాసేజ్ వివాదం.. వాహనాలు నిలిపినా అభ్యంతరాలు.. వీడియోల చిత్రీకరణపై ఆరోపణలు









వరంగల్, నేటిధాత్రి:
పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ధరలో భోజనం అందించే భారత్ మెస్‌కు వెళ్లాలంటేనే వినియోగదారులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందని యాజమాన్యం, పలువురు వినియోగదారులు వాపోతున్నారు. భోజనం చేసేందుకు వచ్చే వారి వాహనాలను పార్కింగ్ చేయనివ్వకపోవడం, రాకపోకల సమయంలో అడ్డుకోవడం, ప్రశ్నిస్తే వీడియోలు చిత్రీకరిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసలు అక్కడి దారి ఎవరిది..? ప్రజలు నడిచేందుకు కూడా అడ్డంకులు ఎందుకు..? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.



### వాహనం ఆపినా.. నడిచినా అభ్యంతరమేనా..?

భారత్ మెస్‌కు భోజనం చేసేందుకు వచ్చే వారు తమ వాహనాలను ప్రధాన రహదారిపై కూడా నిలిపేందుకు కొందరు ప్రైవేట్ వ్యక్తులు అభ్యంతరం చెబుతున్నారని యాజమాన్యం ఆరోపిస్తోంది. వాహనాలను ఎందుకు నిలపకూడదని ప్రశ్నిస్తే ఎదురుమాటలు చెప్పడంతో పాటు వీడియోలు తీస్తున్నారని పేర్కొంటోంది. ప్రభుత్వ పరిధిలోని రహదారిపై కూడా ప్రజల రాకపోకలను అడ్డుకునే అధికారం ప్రైవేట్ వ్యక్తులకు ఉందా? అన్నది అధికారులే స్పష్టం చేయాలని కోరుతోంది. జాయింట్ ప్యాసేజ్‌లో వాహనాల పార్కింగ్ చేయకూడదంటూ కోర్టు ఉత్తర్వులు ఉన్నట్లు సంబంధిత వ్యక్తులు చెబుతున్నారని, అయితే ఆ ఉత్తర్వుల అర్థం ప్రజలకు కనీసం నడిచేందుకు కూడా దారి లేకుండా చేయడమేనా? అని భారత్ మెస్ యాజమాన్యం ప్రశ్నిస్తోంది. కోర్టు ఆదేశాలు ఏ మేరకు వర్తిస్తాయి..? వాటి అమలు తీరు ఎలా ఉండాలి..? అన్నది సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంటోంది.

### ఖాళీ చేయాలంటూ ఒత్తిళ్లు..?

భారత్ మెస్‌ను ఖాళీ చేయాల్సిందిగా సంబంధిత స్థల యజమాని తరపున ఒత్తిళ్లు వస్తున్నాయని యాజమాన్యం ఆరోపిస్తోంది. కనీసం కొంత సమయం ఇచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతోంది. మరోవైపు అదే వ్యాపారి తమ వ్యాపార అవసరాల కోసం ప్రధాన రహదారిని తన వ్యాపారం కోసం వినియోగించుకుంటున్నప్పటికీ, భారత్ మెస్‌కు వచ్చే వినియోగదారుల వాహనాల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తోంది.
"ఒకరికి ఒక న్యాయం.. మరొకరికి మరో న్యాయమా?" అనే ప్రశ్నను స్థానికులు లేవనెత్తుతున్నారు. డబ్బు, హోదా ఉన్నవారికి ఒక నిబంధన.. సాధారణ ప్రజలకు మరో నిబంధన ఉండకూడదని, అధికారులు వాస్తవ పరిస్థితులను పరిశీలించి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

### కెమెరాల చూపు ఎటు..?

ఇప్పటికే జాయింట్ ప్యాసేజ్ వివాదం కొనసాగుతుండగా, సీసీ కెమెరాల అంశం కూడా వివాదానికి కారణమైంది. జాయింట్ ప్యాసేజ్ కి సంబంధించిన ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన రెండు హెచ్‌డీ సీసీ కెమెరాలు భారత్ మెస్ ప్రవేశద్వారం, అక్కడికి వచ్చే కస్టమర్ల రాకపోకలు, బాత్రూమ్ వైపు కనిపించేలా ఉన్నాయని యాజమాన్యం ఆరోపిస్తోంది.
భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంపై తమకు అభ్యంతరం లేదని, అయితే వాటి దృష్టి పరిధి పక్కనే ఉన్న హోటల్ కస్టమర్ల కదలికలను రికార్డు చేసేలా ఉండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తోంది. భోజనం చేసేందుకు వచ్చిన వారు తమ కదలికలు రికార్డు అవుతున్నాయనే భావనతో బాత్రూమ్ ఉపయోగించేందుకు కూడా ఇబ్బందిపడుతున్నారని పేర్కొంటోంది.
పోలీసుల సూచన మేరకే కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సంబంధిత వ్యక్తులు చెప్పినట్లు యాజమాన్యం ఆరోపిస్తోంది. ఈ అంశంలో వాస్తవాలు ఏమిటి..? కెమెరాల దృష్టి పరిధి ఎక్కడి వరకు ఉంది..? పక్క వ్యాపార సంస్థ కస్టమర్ల గోప్యతకు ఇబ్బంది కలుగుతోందా..? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### గోనె ఐలయ్య రోడ్డు ఎక్కడ..?

ఇక ఈ మొత్తం వ్యవహారంలో మరో ఆసక్తికర అంశం తెరపైకి వస్తోంది. కొన్నేళ్ల క్రితం వరంగల్ లో గోనె ఐలయ్య పేరుతో ఉన్న దారి ప్రస్తుతం కనుమరుగైన పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. బీట్ బజార్ నుంచి పాత మహేశ్వరి గార్డెన్ ముందుగా స్టేషన్ రోడ్డుకు కలిసే ప్రధాన మార్గంగా ఈ దారి ఉండేదని, కాలక్రమంలో దాని రూపురేఖలు మారిపోయాయని పేర్కొంటున్నారు. ఒకప్పుడు ప్రజల రాకపోకలకు ఉపయోగపడిన దారి క్రమంగా కనుమరుగవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు..? రికార్డుల్లో ఉన్న దారులు క్షేత్రస్థాయిలో ఎందుకు కనిపించడంలేదు..? ఉమ్మడి దారులపై హక్కులు, నిర్మాణ అనుమతులు, రహదారి వినియోగంపై సమగ్ర పరిశీలన జరగాల్సిన అవసరం లేదా..? అన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

### రాజకీయ నాయకులు, అధికారుల జోక్యమే పరిష్కారం!!





జాయింట్ ప్యాసేజ్, భవన నిర్మాణ అనుమతులు, వాహనాల రాకపోకలు, సీసీ కెమెరాల ఏర్పాటు, గోనె ఐలయ్య రోడ్డు అంశాలపై స్థానిక రాజకీయ నాయకులు , సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలని భారత్ మెస్ యాజమాన్యం కోరుతోంది.
ప్రజలు భోజనం చేయడానికి వెళ్లే చోట భయపడాల్సిన పరిస్థితి ఉండకూడదని, వివాదం ఏదైనా చట్టపరమైన మార్గంలో పరిష్కరించుకోవాల్సిందే తప్ప సాధారణ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించకూడదని స్థానికులు అంటున్నారు. ఈ వ్యవహారంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, ఇరువర్గాల వాదనలు విని నిష్పక్షపాత పరిష్కారం చూపాలని భారత్ మెస్ యాజమాన్యం కోరుతోంది.

# కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష

## అభిమానుల పాదయాత్రకు ఘన స్వాగతం

రామకృష్ణాపూర్, నేటిధాత్రి:
తెలంగాణ రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలానికి చెందిన కేసీఆర్ అభిమానులు చేపట్టిన పాదయాత్ర మంగళవారం సాయంత్రం మంచిర్యాలకు చేరుకుంది. వాంకిడి మండలానికి చెందిన జాడి తిరుపతి, దుర్గం శంకర్‌లు కేసీఆర్ మళ్లీ తెలంగాణకు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ సోమవారం నుంచి పాదయాత్ర చేపట్టారు. ప్రజల్లో కేసీఆర్ నాయకత్వంపై తమకున్న అభిమానాన్ని చాటుతూ పాదయాత్రగా మంచిర్యాలకు చేరుకున్న వారికి బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.





అనంతరం వారిని శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో సాగిందని అన్నారు. కేసీఆర్ నాయకత్వంపై ఉన్న విశ్వాసంతో అభిమానులు చేపట్టిన పాదయాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు భవిష్యత్‌లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. కేసీఆర్ నాయకత్వానికి మద్దతుగా పాదయాత్ర చేపట్టిన జాడి తిరుపతి, దుర్గం శంకర్‌లకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ తిరుమల్ వాసు, బీఆర్ఎస్వీ నాయకులు, మాజీ కౌన్సిలర్ జిలకర మహేష్, నస్పూర్ శివ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోగుల మల్లయ్య, అలుగుల సత్తయ్య, అరుణ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు..విద్యపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వేగవంతం చేయాలి
- యూనిఫామ్‌లలో నాణ్యత తప్పనిసరి..ఆగస్టు 15లోగా ఒకటి,30లోగా మరోటి అందించాలి



పరకాల,నేటిధాత్రి :
పరకాల ప్రాంతంలో విద్య,అభివృద్ధి కార్యక్రమాలపై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ప్రత్యేక దృష్టి సారించారు.మంగళవారం పరకాల రాజుపేట సమీపంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను పరిశీలించడంతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల,నాగారం గ్రామంలోని పాఠశాల యూనిఫామ్‌ల కుట్టు కేంద్రం,అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

### స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

పరకాల రాజుపేట సమీపంలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు.ఇప్పటివరకు చేపట్టిన పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.నాణ్యతా ప్రమాణాలను కొనసాగిస్తూ నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.పనుల పురోగతికి సంబంధించిన వివరాలను టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు.

### విద్యార్థులతో కలెక్టర్ ముచ్చట

అనంతరం పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన కలెక్టర్ బీకాం సీఏ బీఏ,బీఎస్సీ డెయిరీ సైన్స్ తరగతులతో పాటు కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి వారి భవిష్యత్ లక్ష్యాలు,కళాశాలకు వస్తున్న ప్రాంతాల గురించి తెలుసుకున్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోష్ కుమార్,టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్,పరకాల ఆర్డీఓ డీఎస్ వెంకన్న తదితరులు ఉన్నారు.

### యూనిఫామ్‌లలో నాణ్యత తప్పనిసరి

నాగారం గ్రామంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు కేటాయించిన పాఠశాల యూనిఫామ్‌ల కుట్టు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఇప్పటివరకు ఎన్ని యూనిఫామ్‌లు సిద్ధం చేశారో,వస్త్ర నాణ్యత,కుట్టు ప్రక్రియ తదితర వివరాలను మహిళా సంఘాల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.సిద్ధం చేసిన యూనిఫామ్‌లను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందించే యూనిఫామ్‌లు నాణ్యమైన వస్త్రంతో,సరైన కొలతలకు అనుగుణంగా,చక్కటి కుట్టుతో ఉండేలా చూడాలని సూచించారు. ఆగస్టు 15లోగా ఒక యూనిఫామ్,ఆగస్టు 30లోగా రెండో యూనిఫామ్ ప్రతి విద్యార్థికి అందేలా కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.మహిళా సంఘాలకు ఉపాధి,ఆదాయ అవకాశాలు కల్పించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

### అంగన్వాడీ కేంద్రం పరిశీలన

అనంతరం నాగారం గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు.చిన్నారులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం చేశారా అని అడిగి తెలుసుకున్నారు.కేంద్ర పరిసరాలను పరిశీలించి పిల్లలకు పరిశుభ్రమైన,ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.ఈ పర్యటనలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)శేషాద్రి, డీఆర్‌డీఓ మేన శ్రీను,పరకాల ఆర్డీఓ డీఎస్ వెంకన్న,జడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు,పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్,మున్సిపల్ కమిషనర్ పవన్,టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్,ఎంపీడీఓ రామకృష్ణ,ప్రాజెక్టు మేనేజర్ జుబేర్ ఖాన్,నాయబ్ తహసీల్దార్ ఆరేపల్లి సుమన్,డీపీఎం రాజేంద్రప్రసాద్,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోష్ కుమార్,గ్రామ సర్పంచ్ రమాదేవి,కౌన్సిలర్లు,ఇతర అధికారులు,మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ మంద బాబు ఆకస్మిక మరణం..

# ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

## ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



ప్రజా సమస్యలపై పోరాడిన నేతకు ఘన నివాళి
ఆయన ఆశయాలను కొనసాగిస్తాం..
ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తాం
ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకను కోల్పోయాం
మంద బాబు ఆశయ సాధనకు కృషి చేస్తాం

వర్ధన్నపేట,నేటిధాత్రి:
ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఎంసీపీఐ(యు) వరంగల్ డివిజన్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ మంద బాబు ఆకస్మిక మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో కామ్రేడ్ మంద బాబు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు.ఆయన మృతదేహానికి ఎంసీపీఐ(యు) నాయకులు పార్టీ జెండాను కప్పి, ఎర్ర శాలువా వేసి, పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్‌తో పాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనే కుమారస్వామి, కన్నం వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, డివిజన్ కార్యదర్శి మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కనకం సంధ్య, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, మాలోత్ సాగర్, బాసిపాక రమేష్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ.. కామ్రేడ్ మంద బాబు ఆకస్మిక మృతి జిల్లా పార్టీని తీవ్రంగా కలిచివేసిందన్నారు. తన జీవితకాలమంతా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన మంద బాబు, ఎన్ని కష్టాలు ఎదురైనా తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసం చివరి వరకు నిలబడ్డారని తెలిపారు. అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ అడుగుజాడల్లో నడుస్తూ.. మొక్కవోని ధైర్యంతో, నీతి నిజాయితీలతో ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా మంద బాబు నిలిచారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన అలాంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు.

### ఆశయ సాధనకు కృషి చేయాలి

కామ్రేడ్ మంద బాబు ఆశయాలను కొనసాగిస్తూ.. ఆయన ఆశయ సాధన కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. అనంతరం మంద బాబు భార్య, కుమారులు, ఇతర కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్, మండల నాయకులు గుగులోత్ అరుణ్ నాయక్, బత్తిని కుమారస్వామి, ఉడుత గణేష్, కొట్టూరి కరుణాకర్, బిక్షపతి, కాజా మియా, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం" "శక్తి బ్రాడ్ కాస్టింగ్స్" ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

## "నేటిధాత్రి" పత్రికను ఆదరించిన విధంగానే "నేటిధాత్రి 9" "యూట్యూబ్ ఛానల్" కూడా ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# కివి పండును తప్పనిసరిగా తినాల్సిందే..!

వర్షాకాలం అనేక రకాల రోగాలకు కారణమవుతుంది. ఈ సీజన్‌లో జాగ్రత్తగా లేకపోతే అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. దగ్గు, జలుబు, జ్వరం ఈ సీజన్‌లో కామన్‌గా వస్తూనే ఉంటాయి. ఇక దోమలు కుట్టడం వల్ల చికెన్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయి. అలాగే కలుషిత ఆహారం తిన్నా, నీళ్లు తాగినా టైఫాయిడ్ వస్తుంది. సాధారణంగా చిన్నారులు లేదా పెద్దలు ఎవరికైనా సరే వర్షాకాలంలోనే ఎక్కువగా రోగాలు వస్తుంటాయి. అయితే ఈ సీజన్‌లో రోగాల నుంచి రక్షణ పొందేందుకు గాను అన్ని రకాల జాగ్రత్తలను పాటించాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. శుభ్రమైన ఆహారాన్నే తినాలి. తినే ముందు కచ్చితంగా చేతులను శుభ్రం చేసుకోవాలి. అలాగే దోమలు వ్యాపించకుండా నివారణ చర్యలు చేపట్టాలి. ఇక ఆహారంలో పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఈ క్రమంలోనే రోగ నిరోధక శక్తిని పెంచే కివీ వంటి పండ్లను తినాలి. దీని వల్ల అనేక లాభాలు కలుగుతాయి.



### సీజనల్ వ్యాధులకు చెక్..

వర్షాకాలంలో మనకు దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇవి రాకుండా ఉండాలన్నా, వచ్చిన రోగాలు త్వరగా తగ్గాలన్నా మనకు రోగ నిరోధఖ శక్తి ఎక్కువగా ఉండాలి. కివీ పండ్లను తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. నారింజ పండ్ల కన్నా కివి పండ్లలోనే విటమిన్ సి మనకు అధికంగా లభిస్తుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో శరీరం రోగాలు, ఇన్‌ఫెక్షన్లపై పోరాటం చేస్తుంది. రోజూ కివీ పండ్లను తినడం వల్ల శ్వాసకోశ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. జ్వరం నుంచి కూడా త్వరగా కోలుకుంటారు. ఇక వర్షాకాలంలో మన జీర్ణ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. అజీర్తి, కడుపు ఉబ్బరం, ఫుడ్ పాయిజనింగ్ ఇబ్బందులకు గురి చేస్తాయి. ఇలాంటి సమస్యలు ఉన్నవారు కివి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది. కివి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది పేగుల్లో ఆహారం లేదా మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది.

### డెంగీ నుంచి త్వరగా రికవరీ..

డెంగీ జ్వరం వచ్చిన వారు కివి పండ్లను తింటుంటే త్వరగా కోలుకుంటారు. డెంగీ వల్ల రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోతుందన్న విషయం తెలిసిందే. అయితే కివి పండ్లను తింటుంటే తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. ఇవి ప్లేట్‌లెట్స్ తయారు అయ్యేలా చేస్తాయి. ఈ పండ్లలో ఉండే విటమిన్ సి వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. ఐరన్ వల్ల రక్తం తయారవడం మాత్రమే కాదు, ప్లేట్‌లెట్ల ఉత్పత్తి సైతం పెరుగుతుంది. కివి పండ్లలో ఉండే ఫోలేట్ ఎర్ర రక్త కణాల తయారీకి దోహదం చేస్తుంది. దీంతో ప్లేట్‌లెట్లు వృద్ధి చెందుతాయి. డెంగీ నుంచి త్వరగా కోలుకుంటారు. కివి పండ్లను యాంటీ ఆక్సిడెంట్లకు నిలయంగా చెప్పవచ్చు. ఈ పండ్లలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కణాలను రక్షిస్తాయి. ముఖ్యంగా ఈ పండ్లలో ఉండే పాలిఫినాల్స్ ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో వాపులు తగ్గుతాయి. అలాగే వర్షాకాలం సీజనల్‌గా వచ్చే వ్యాధులు తగ్గిపోతాయి.

### చర్మ సంరక్షణకు..

వర్షాకాలంలో వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. దీని వల్ల అనేక రకాల చర్మ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా ఫంగస్, వైరస్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. కానీ కివి పండ్లను తింటే విటమిన్ సి లభిస్తుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో చర్మం సురక్షితంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు సైతం తొలగిపోతాయి. కివి పండ్ల గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ కూడా చాలా తక్కువగా ఉంటుంది. కనుక ఈ పండ్లను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. శరీరం ఇన్సులిన్ ను మరింత సమర్థవంతంగా వాడుకునేలా చేస్తాయి. దీంతో షుగర్ తగ్గి డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా కివి పండ్లను వర్షాకాలంలో తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# కుంకుమ పువ్వు కేవలం గర్భిణీలకే కాదు..
# అందరికీ ఎంతో మేలు చేస్తుంది..!



గర్భంతో ఉన్న మహిళలు కుంకుమ పువ్వును పాలలో కలిపి తాగాలని మన పెద్దలు చెబుతుంటారు. వైద్యులు కూడా ఇదే విషయాన్ని సూచిస్తుంటారు. కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగడం వల్ల గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని, పిల్లలు ఆరోగ్యంగా పుడతారని వైద్యులు చెబుతుంటారు. అయితే కుంకుమ పువ్వు అనగానే కేవలం గర్భిణీలు మాత్రమే దీన్ని తీసుకోవాలని చాలా మంది అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. వాస్తవానికి కుంకుమ పువ్వును అందరూ తీసుకోవచ్చు. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కుంకుమ పువ్వు రెక్కలు 2 తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు 2 సార్లు తాగవచ్చు. ఇలా కుంకుమ పువ్వుతో తయారు చేసే టీని తాగుతుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

### మానసిక సమస్యలకు..

కుంకుమ పువ్వు టీని సేవించడం వల్ల మన మెదడులో న్యూరో ట్రాన్స్‌మిటర్ల ఉత్పత్తి పెరుగుతుంది. డోపమైన్, సెరొటోనిన్‌లు అధికంగా ఉత్పత్తి అవుతాయి. వీటిని మూడ్‌ను నియంత్రించే సమ్మేళనాలుగా చెబుతుంటారు. అందువల్ల కుంకుమ పువ్వుతో తయారు చేసే టీ ని తాగుతుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. కుంకుమ పువ్వులో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా క్రోసిన్, క్రోసెటిన్, సఫ్రనాల్, కాంప్‌ఫెరాల్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని, శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులను తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధుల వంటి ప్రాణాంతక రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

### గుండె ఆరోగ్యానికి..

కుంకుమ పువ్వులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా ఈ టీని సేవిస్తుంటే పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. శరీరంలో క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా పెద్దపేగు, బ్రెస్ట్, లంగ్, ప్రోస్టేట్, బోన్ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. ఈ విషయాన్ని సైంటిస్టులు తమ అధ్యయనాల ద్వారా నిరూపించారు. కుంకుమ పువ్వు టీని రోజూ తాగడం వల్ల శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. కుంకుమ పువ్వుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మెదడు కణాలను రక్షిస్తాయి. దీంతో మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. చురుగ్గా ఉంటారు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. వయస్సు మీద పడడం వల్ల వచ్చే అల్జీమర్స్ రాకుండా అడ్డుకోవచ్చు.

### మహిళల సమస్యలకు..

మహిళలకు నెలసరి సమయంలో అనేక రకాల సమస్యలు వస్తుంటాయి. అలాంటి వారు కుంకుమ పువ్వు టీని సేవిస్తుంటే ఫలితం ఉంటుంతి. దీంతో వారికి ఉండే చిరాకు, తలనొప్పి, ఆహారంపై యావ, నొప్పులు వంటి సమస్యలు తగ్గిపోతాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం కుంకుమ పువ్వు టీని తాగడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కుంకుమ పువ్వు టీని తప్పకుండా తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కుంకుమ పువ్వులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. కంటి చూపును పెంచుతాయి. కళ్ల సమస్యలు ఉన్నవారు కుంకుమ పువ్వు టీని తాగుతుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. ఇలా కుంకుమ పువ్వుతో మనం అనేక లాభాలను పొందవచ్చు.

# దానిమ్మ పండ్లను తినడం మరిచిపోకండి..



## ఎన్నో లాభాలను పొందవచ్చు..!

దానిమ్మ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. చూసేందుకు ఎరుపు రంగులో ఎంతో ఆకర్షణీయంగా ఈ పండ్లు కనిపిస్తుంటాయి. దానిమ్మ పండ్లను తినేందుకు చాలా మంది ఇష్టం చూపిస్తుంటారు. ఈ పండ్లతో జ్యూస్ తయారు చేసి కూడా తాగుతుంటారు. దానిమ్మ పండ్లను ఈ సీజన్‌లో రోజూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఒక కప్పు దానిమ్మ గింజలను తింటే సుమారుగా 144 క్యాలరీల శక్తి లభిస్తుంది. 32 గ్రాముల పిండి పదార్థాలు, 7 గ్రాముల ఫైబర్, 3 గ్రాముల ప్రోటీన్లు, 2 గ్రాముల కొవ్వు, అధిక మోతాదులో విటమిన్ సి, కె, బి9, పొటాషియం, మాంగనీస్, కాపర్, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి పోషకాలు లభిస్తాయి. దానిమ్మ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

### యాంటీ ఆక్సిడెంట్లు అధికం..

యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లలో దానిమ్మ పండ్లు ఒకటని చెప్పవచ్చు. ఈ పండ్లలో ప్యూనికాలాజిన్స్, ఆంథోసయనిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందువల్లే ఈ పండ్లు ఎరుపు రంగులో ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. కణాలు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా రక్షిస్తాయి. దీని వల్ల వయస్సు వెనక్కి మళ్లుతుంది. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే నాడీ సంబంధ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ జ్యూస్‌ను తాగితే ఇంకా ఎక్కువ యాంటీ ఆక్సిడెంట్లను పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

### గుండె ఆరోగ్యానికి..

దానిమ్మ పండ్లలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఎంతటి వాపులను అయినా సరే ఈ పండ్లు తగ్గిస్తాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా కూడా పనిచేస్తాయి. దీని వల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. అలాగే ఇన్‌ఫ్లామేటరీ బౌల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మెటబాలిక్ వ్యాధుల నుంచి సైతం బయట పడవచ్చు. దానిమ్మ పండ్లను తినడం వల్ల మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా జాగ్రత్తగా ఉండవచ్చు. గుండె పనితీరు మెరుగు పడుతుంది.

### క్యాన్సర్ రాదు..

దానిమ్మ పండ్లలో యాంటీ క్యాన్సర్ గుణాలు ఉంటాయి. సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల ప్రకారం దానిమ్మ పండ్లను రోజూ తింటే పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఈ పండ్లను తినడం వల్ల జీర్ణ వ్యవస్థకు సైతం మేలు జరుగుతుంది. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దానిమ్మ పండ్లను తింటే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. యాక్టివ్‌గా ఉంటారు. ముఖ్యంగా చిన్నారులకు ఈ పండ్లను తినిపిస్తే వారి తెలివితేటలు పెరుగుతాయి. చదువుల్లో రాణిస్తారు. ఈ పండ్లను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ సీజన్‌లో ఈ పండ్లను తింటుంటే సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు, జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే ప్లేట్‌లెట్లను పెంచడంలోనూ దానిమ్మ ఎంతగానో సహాయం చేస్తుంది. కనుక ఈ పండ్లను ఈ సీజన్‌లో తినడం మరిచిపోకండి. లేదంటే అనేక లాభాలను కోల్పోతారు.

# డార్క్ చాకొలెట్లను తరచూ తింటే
# ఇన్ని లాభాలు కలుగుతాయా..



చాకొలెట్లలో అనేక రకాలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. వీటిని చిన్నారుల నుంచి పెద్దల వరకు చాలా మంది ఇష్టంగానే తింటుంటారు. అయితే అన్ని చాకొలెట్లూ ఆరోగ్యకరం కాదు. కానీ డార్క్ చాకొలెట్లు మాత్రం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. డార్క్ చాకొలెట్లలో కొకొవా అధికంగా ఉంటుంది. కనుక అలాంటి చాకొలెట్లను తింటే ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు. డార్క్ చాకొలెట్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటి వల్లే ఈ చాకొలెట్లు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఈ చాకొలెట్లలో ఫ్లేవనాల్స్ ఉంటాయి. ఇది ఒక రకమైన ఫ్లేవనాయిడ్స్ జాబితాకు చెందుతుంది. అలాగే వీటిలో పాలిఫినాల్స్ కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి.

### గుండె ఆరోగ్యానికి..

డార్క్ చాకొలెట్లలో అనేక ఆర్గానిక్ సమ్మేళనాలు ఉంటాయి. సాధారణంగా మనకు. ఇవన్నీ బెర్రీ జాతులకు చెందిన పండ్లలో అధికంగా లభిస్తాయి. కానీ డార్క్ చాకొలెట్లను తినడం వల్ల కూడా యాంటీ ఆక్సిడెంట్లను అధికంగా పొందవచ్చు. అందువల్ల ఈ చాకొలెట్లను తింటే శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులు తగ్గిపోతాయి. గుండె జబ్బులు, పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. డార్క్ చాకొలెట్లలో అధికంగా ఉండే ఫ్లేవనాల్స్ మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇది రక్త నాళాలను ప్రశాంత పరుస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. ఫలితంగా బీపీ తగ్గుతుంది. బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా ఉంటాయి. కనుక హైబీపీ ఉన్నవారు డార్క్ చాకొలెట్లను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

### డయాబెటిస్ నియంత్రణకు..

డార్క్ చాకొలెట్లలో ఉండే పాలిఫినాల్స్ మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. దీని వల్ల హార్ట్ ఎటాక్ రాకుండా జాగ్రత్త పడవచ్చు. డార్క్ చాకొలెట్లు తియ్యగా ఉంటాయి. కానీ తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటాయి. అందువల్ల ఈ చాకొలెట్లను తింటే షుగర్ లెవల్స్ అంతగా పెరగవు. పైగా ఈ చాకొలెట్లలో ఉండే ఫ్లేవనాల్స్ ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. ఫలితంగా షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా డార్క్ చాకొలెట్లను తినవచ్చు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు.

### మెదడు యాక్టివ్‌నెస్ కోసం..

డార్క్ చాకొలెట్లలో ఉండే ఫ్లేవనాల్స్ మెదడుకు రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీని వల్ల మెదడు పనితీరు మెరుగు పడుతుంది. యాక్టివ్‌గా మారుతుంది. అప్రమత్తత పెరుగుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చు. చిన్నారులకు డార్క్ చాకొలెట్లను తరచూ ఇస్తుంటే వారి మెదడు చురుగ్గా పనిచేస్తుంది. చదువుల్లోనూ రాణిస్తారు. అయితే డార్క్ చాకొలెట్లను మాత్రమే ఇవ్వాలి. చక్కెర అధికంగా ఉండే సాధారణ చాకొలెట్లను ఇవ్వకూడదు. ఇక డార్క్ చాకొలెట్లను తినడం వల్ల మన శరీరంలో ఎండార్ఫిన్లు రిలీజ్ అవుతాయి. ఇవి ఫీల్ గుడ్ హార్మోన్ల జాబితాకు చెందుతాయి. కనుక మన మూడ్ మారుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. నిద్ర లేమి నుంచి బయట పడవచ్చు. ఇలా డార్క్ చాకొలెట్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# ఇద్దరిలో ఒకరు ఎందుకలా



హలో జిందగీ. కవల పిల్లలు పుట్టినపుడు ఒకరు బలహీనంగా మరొకరు బలంగా, ఒకరు ఆరోగ్యంగా మరొకరు సమస్యలతో పుట్టడానికి కారణం ఏమిటి? కవల పిల్లలు కడుపులో ఉన్నప్పుడు వాళ్లు చక్కటి ఆరోగ్యంతో పుట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుపగలరు.
ఓ పాఠకురాలు

కవల పిల్లల్లో ఒకరు బలంగా, ఇంకొకరు బలహీనంగా ఉండటానికి రకరకాల కారణాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లు ఒకే అండం నుంచి ఏర్పడ్డారా లేదా రెండు అండాల నుంచి ఏర్పడ్డారా అన్నది ముఖ్యం. వంశపారంపర్యం ఉన్నవాళ్లకు రెండు వేర్వేరు అండాల నుంచి పిండాలు ఏర్పడతాయి. దానివల్ల ఇద్దరు పిల్లలూ కొంత ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. కానీ ఒకే అండం నుంచి ఏర్పడి ఒకే మాయ, ఉమ్మనీరు పంచుకుంటే మాత్రం ఎక్కువ శాతం ఒకరు బలహీనంగా ఉంటారు. ఐవీఎఫ్‌లాంటి విధానాల్లో పిండం ఏర్పడితే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. ముఖ్యంగా ఒకే మాయలో ఉన్నప్పుడు ఇద్దరికీ రక్త ప్రసరణ సమానంగా ఉండదు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ అందుతుంది. అలాగే ఒక బిడ్డ నుంచి మరో బిడ్డకు రక్తం వెళ్లే పరిస్థితులూ ఉంటాయి.

అలాంటప్పుడు మొదటి బిడ్డ గుండె బలహీనంగా ఉంటుంది. ఇవి మాత్రమే కాదు, బిడ్డ ఏర్పడటంలోనూ రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి. తల్లికి కూడా హైబీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రీ మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలూ ఎక్కువే. అలాగే డెలివరీ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. ఇద్దరు బిడ్డలకు సరిపడా పెద్దగా సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. అందుకే, కడుపులో కవలలు ఉన్నప్పుడు డాక్టర్ చెప్పిన సూచనలను జాగ్రత్తగా పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసరమైన ఎన్‌ఐసీయూ సదుపాయం ఉండే ఆసుపత్రులకు అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే సాధారణ గర్భం కంటే మరింత జాగ్రత్తగా ఉండటం ద్వారా కొంతవరకూ కాంప్లికేషన్లను అధిగమించవచ్చు.

**డాక్టర్ పి. బాలాంబ సీనియర్ గైనకాలజిస్ట్**

# గోధుమ పిండికి ఇవి కలిపితే
# టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..!



బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు

గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం. ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది.మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, కర్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది. ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్..

మునగాకు పొడి ,పసుపుజి,మెంతి పొడి

# పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడిసరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉపయోగపడతాయి.

కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపునొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.



రాజీవ్ రహదారి లో శామీర్ పేట ప్రమాదకర చౌరస్తా లో వైన్స్ షాపుల ముందు రోడ్డులో అక్రమంగా, విచ్చలవిడిగా పార్కింగ్ చేసిన వాహనాలు



రాజీవ్ రహదారి స్టేట్ హై వే లో శామీర్ పేట వద్ద నిత్యకృత్య ప్రమాదాల నిలయంగా మారిన నల్సర్ చౌరస్తా

రాజీవ్ రహదారి స్టేట్ హై వే లో శామీర్ పేట వద్ద నిత్యకృత్య ప్రమాదాల నిలయంగా మారిన నల్సర్ చౌరస్తా

# యమపురికి రహదారిగా మారిన రాజీవ్ రహదారి?

నేటిధాత్రి exclusive

"నేటిధాత్రి",శామీర్ పేట:

అసలే అది రాజీవ్ రహదారి స్టేట్ హైవే.. ఆ రోడ్డు ప్రయాణీకులకు ప్రమాద రహితంగా ఉండాలి... అయినా సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యం, పట్టింపు లేని మూలంగా గత పదేళ్ళుగా ఆ రోడ్డులో ప్రయాణీకులకు అవసరమైన యూటర్న్, సరైన సర్వీసు రోడ్డు లేని ఫలితంగా ఆ రోడ్డు ప్రయాణీకులకు శాపంగా మారింది. ఆ రోడ్డులో ప్రమాదాలు నిత్య కృత్యమవుతున్నాయి. సికింద్రాబాద్, జేబీఎస్ నుంచి శామీర్ పేట మీదుగా ప్రజ్ఞాపూర్, సిద్ధిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని మీదుగా మంచిర్యాల వరకు దాదాపు 200 కిలో మీటర్ల దూరం వరకు నాలుగు లైన్లతో గత 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రాజీవ్ రహదారి స్టేట్ హైవే రోడ్డును ఏర్పాటు చేసింది. ఈ రాజీవ్ రహదారి స్టేట్ హైవే గుండా ప్రజ్ఞాపూర్ సిద్ధిపేట, హుస్నాబాద్, సిరిసిల్ల,కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, మంథని, రామగుండం, గోదావరిఖని, హుజురాబాద్ తదితర జిల్లాల కు చెందిన ప్రయాణీకులు నిత్యం దాదాపు వేలాది సంఖ్యలో వివిధ వాహనాల్లో రాకపోకలను సాగిస్తున్నారు.

## శామీర్ పేట వద్ద యూటర్న్, సర్వీసు రోడ్డు లేక పదేళ్లుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల తంతు.

కాగా ముఖ్యంగా రాజీవ్ రహదారి స్టేట్ హైవే లో మండల కేంద్రం శామీర్ పేట ఉంది. శామీర్ పేట ప్రధాన చౌరస్తా వద్ద నాలుగు లైన్ల రోడ్డు వేసేటప్పుడు సంబంధిత ఆర్ అండ్ బి శాఖ అధికారులు యూటర్న్, సర్వీసు రోడ్లను వేయడం మర్చిపోయారు. ఫలితంగా శామీర్ పేట గ్రామంలో నుంచి రాజీవ్ రహదారి హైవేలోకి వెళ్లే ప్రయాణీకులు, చోదకులకు యూటర్న్, సర్వీసు రోడ్డు లేక ఎదురుగా కరీంనగర్ వైపునకు వచ్చే వాహనాలతో అనేక రకాలుగా నిత్యం నరకయాతన పడుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు . ఆ రోడ్డులో యూటర్న్ లేక రోడ్డు దాటేటప్పుడు గత పదేళ్లుగా ఎంతోమంది వాహనచోదకులు, ప్రయాణీకులు ఎదురుగా వచ్చే వాహనాలకు బలైపోతున్నారు. అలాగే ఎంతో మంది ప్రయాణీకులు వికలాంగులవుతున్నారు. శామీర్ పేట గ్రామం నుంచి అవతలి వైపునకు నల్సర్ వైపునకు, కరీంనగర్ వైపునకు వెళ్లడానికి వాహనచోదకులు, ప్రయాణీకులకు సరైన సర్వీసు రోడ్డు, యూటర్న్ లేదు. ప్రస్తుతమున్న ప్రమాదకర గుంతలతో ఉన్న సర్వీసు రోడ్డులో ప్రయాణీకులు వెళ్లలేక నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## శాఖల మధ్య సమన్వయ లోపం పదేళ్లుగా ప్రయాణీకులకు శాపం.

రాజీవ్ రహదారి స్టేట్ హైవేలో శామీర్ పేట వద్ద యూటర్న్, సర్వీసు రోడ్డు లేక దాదాపు గత పదేళ్ళుగా వాహనదారులు ప్రయాణీకులు నిత్యం అనేక రకాలుగా నరకయాతన పడుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత ఆర్ అండ్ బి, మున్సిపల్, ట్రాఫిక్ పోలీసు శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడి గత పదేళ్లుగా చోద్యం చూస్తున్నారు తప్ప ఆ స్టేట్ హైవేలో యూటర్న్, సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయడం లేదు.

## రోడ్డు ప్రమాదాలకు తోడుగా వైన్స్ షాపుల ఏర్పాటుతో మరిన్ని ప్రమాదాలు.

అసలే అది నిత్యం రోడ్డు ప్రమాదాల చౌరస్తా. ఆ చౌరస్తాలో రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యంగా జరుగుతున్నాయని తెలిసినా, అయినా ఆ రోడ్డు ప్రమాదాల చౌరస్తాకు తోడుగా వ్యాపారులు గత ఏడు కట్ట మైసమ్మ పేరుతో వైన్స్ షాపులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. దీంతో రాజీవ్ రహదారి స్టేట్ హైవే చౌరస్తాలో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు మరిన్ని అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. ఆ చౌరస్తాలో వైన్స్ షాపులను పెట్టడంతో మండుతున్న మంటపై పెట్రోలు పోసిన చందంగా రోడ్డు ప్రమాదాలు మరిన్ని ఎక్కువయ్యాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అ రోడ్డు ప్రమాదాల చౌరస్తాలో వైన్స్ షాపులను ఏర్పాటు చేయడంతో ఆ చౌరస్తాలో మందుబాబులు విచ్చలవిడిగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఆ రాజీవ్ రహదారి చౌరస్తాలో ప్రమాదాలు మరిన్ని నిత్య కృత్యంగా పెరిగిపోతున్నాయి. ఆ చౌరస్తాలో వైన్స్ షాపుల ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది.

## యుద్ధప్రతిపాదికన యూటర్న్, సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి.

శామీర్ పేట గ్రామంలో నుంచి కరీంనగర్ వైపునకు వెళ్లేందుకై ప్రయాణీకులకు అవసరమైన యూటర్న్, సర్వీస్ రోడ్డును యుద్ధ ప్రతిపాదికన ఏర్పాటు చేసి రాజీవ్ రహదారిలో నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించాలని స్థానిక శామీర్ పేట ప్రజలు ప్రయాణీకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత ఆర్ అండ్ బి, మున్సిపల్, ట్రాఫిక్ శాఖల అధికారులు ఈ సమస్య పట్ల వెంటనే స్పందించి బాధ్యతగా చొరవ తీసుకొని నిర్లక్ష్యం లేకుండా రాజీవ్ రహదారిలో శామీర్ పేట వద్ద వాస్తవ రోడ్డు ప్రమాదాల పరిస్థితిని పరిశీలించి అవసరమైన యూటర్న్, సర్వీస్ రోడ్లను యుద్ధ ప్రతిపాదికన ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



రాజీవ్ రహదారి స్టేట్ హై వే లో శామీర్ పేట వద్ద నిత్యకృత్య ప్రమాదాల నిలయంగా మారిన నల్సర్ చౌరస్తా

## యూటర్న్ సర్వీసు రోడ్డును ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలి అరుణ్ కుమార్ స్థానిక ప్రయాణికుడు శామీర్ పేట

రాష్ట్ర ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించి శామీర్ పేట గ్రామంలో నుంచి వచ్చే ప్రయాణీకుల, వాహనచోదకుల కోసం శామీర్ పేట వద్ద రాజీవ్ రహదారి స్టేట్ హైవేలో అవసరమైన యూటర్న్, సర్వీసు రోడ్లను యుద్ధ ప్రతిపాదికన ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలి

యూటర్న్ ఏర్పాటు చేయించి రోడ్డు ప్రమాదాల నివారణకు బాధ్యతగా చర్యలను తీసుకుంటాం పవన్ కుమార్ రెడ్డి అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్

శామీర్ పేట గ్రామంలో నుంచి వచ్చే ప్రయాణీకులు కరీంనగర్ వైపునకు వెళ్లేందుకై అవసరమైన యూటర్న్, ఏర్పాటు చేసేందుకై రాజీవ్ రహదారి స్టేట్ హైవే అధికారులకు లేఖను పెట్టాం. సాధ్యమైనంత తొందరలో ఆ యూటర్న్ ను ఏర్పాటు చేయించి రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను బాధ్యతగా తీసుకుంటాం. శామీర్ పేట వద్ద యూటర్న్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన పరిష్కార చర్యలను బాధ్యతగా, తప్పనిసరిగా తీసుకుంటాం.



# నల్లబెల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి : సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్

వర్ధన్నపేట, నేటిధాత్రి:

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో, లుమినస్ ఆస్పత్రి సారథ్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, గ్రామంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం



శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు.



వైరల్ జ్వరాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

గ్రామీణ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు అందించేందుకు నిర్వహించిన ఈ మెగా వైద్య ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ బిర్రు చంద్రయ్య, బాలవికాస ప్రతినిధులు పసునూరి స్వాతి, కొండేటి అశ్విత, అపర్ణ, లుమినస్ ఆస్పత్రి వైద్యులు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్



- 47 మంది ఆడపడుచులకు రూ.47.05 లక్షల చెక్కులు పంపిణీ
- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట, నేటిధాత్రి:

పేదింటి ఆడపడుచుల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం ఐనవోలు మండలానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు రూ.47,05,452 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడపిల్లల వివాహ సమయంలో పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోహన్‌గౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, జేబీఎం జిల్లా చైర్మన్ రుగ్వేద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సాంబయ్య, మహేష్‌గౌడ్, ఎలిశా, సీనియర్ నాయకులు మధు, రాకేష్‌రెడ్డి, రాజు, లక్ష్మణ్‌రావు, సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట!

- భూగర్భ జలాల పరిరక్షణ కోసం సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ పోరాటం
- అనుమతులు, కూపన్లు లేకుండా ఇసుక తరలింపు.. ట్రాక్టర్లను అడ్డుకున్న సర్పంచ్

మొగుళ్లపల్లి, నేటిధాత్రి:

మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని వాగు నుంచి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ స్వయంగా అడ్డుకున్నారు. వాగులోకి ట్రాక్టర్లు వచ్చి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతి పత్రాలు, ఇందిరమ్మ కూపన్లు లేకపోవడాన్ని గుర్తించి అక్రమ రవాణాను అక్కడికక్కడే నిలిపివేశారు.

### భూగర్భ జలాలపై ప్రభావం

ఈ సందర్భంగా సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ మాట్లాడుతూ.. గత ఏడాది నుంచి వాగులో ఇసుకను విచ్చలవిడిగా తవ్వడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాగులో ఇసుక నిల్వలు తగ్గిపోవడంతో భూగర్భ జలాలు కూడా క్రమంగా తగ్గుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో వాగులు, చెరువులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులు అనేక మంది ఉన్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతుల పంటలకు, భవిష్యత్ నీటి అవసరాలకు ఇబ్బందులు



తలెత్తకుండా వాగు ఇసుకను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

### అక్రమ రవాణాకు తావులేదు

మొగుళ్లపల్లి సర్పంచ్‌గా ప్రజల తరఫున తన బాధ్యతగా అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నానని విజయ రవీందర్ తెలిపారు. ఇకపై ఎవరూ అనుమతులు లేకుండా ఇసుకను తరలించవద్దని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వాగుల వద్ద నిఘా పెంచాలని డిమాండ్ చేశారు.

# ఆంధ్ర రైజింగ్ స్టార్ నారా లోకేష్

"ఫార్చ్యూన్ ఇండియా" అనే జాతీయ ఆంగ్ల పత్రిక ఇచ్చిన" ఆంధ్ర రైజింగ్ స్టార్" అనే గుర్తింపు యువనాయకుడు ఆంధ్ర ప్రజల ఆశాకిరణం విద్య శాఖ మంత్రి నారా లోకేష్ రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలు రాయిగా భావించవచ్చు.ప్రభుత్వ నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో ఫలితాలుగా మార్చడం, పెట్టుబడుల ప్రకటనలు వాస్తవ పరిశ్రమలుగా మారి యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ, ముందుకు సాగుతున్న లోకేష్ కు లభించిన రైజింగ్ స్టార్ ఓ గౌరవంగా భావించాలి. రాజకీయాల్లో వారసత్వం అనేది ఒక మెట్టు మాత్రమే. కానీ ఆ మెట్టుపై నిలబడి గమ్యాన్నిచేరుకోవడానికి కావాల్సిన శ్రమ, పట్టుదల ఉంటేనే చరిత్ర గుర్తిస్తుంది. అనతి కాలంలోనే రాజకీయంగా తనకంటూ ఒక గుర్తింపు సాధించిన నాయకులు బహుఅరుదుగా కనిపిస్తారు. అయితే రాష్ట్ర ఐటి, మానవవనరుల శాఖ మంత్రి, తెలుగు దేశం పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు నారా లోకేష్ ఆ కోవకే చెందుతారు.




40u40: India's Brightest Young Business Minds

ఇదే విషయాన్ని ప్రముఖ ఇంగ్లీషు పత్రిక "ఫార్చ్యూన్ ఇండియా" తన ఆగస్టు సంచికలో స్పష్టంచేసింది.

"ఆంధ్రాస్ రైజింగ్ స్టార్ హౌ నారా లోకేష్ "అంటూ మంత్రి ,యువనేత నారా లోకేష్ ను ప్రశంసిస్తూ ప్రచురించిన కథనం తెలుగు ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. 40 అండర్ 40 విభాగంలో లోకేష్ ను ఎపి భవిష్యత్ రాజకీయాల్లో కీలకనాయకుడిగా పేర్కొనడాన్ని చూస్తే ఆయనను తెలుగు ప్రజల ఆశాకిరణంగా అభివర్ణించవచ్చు. అంతర్జాతీయ ఆంగ్ల పత్రిక గుర్తించే స్థాయికి ఒక నాయకుడుగా ఎదగడమంటే ఆషామాషి కాదు. 2019 కి ముందు నారాలోకేష్ ను కేవలం ఒక ముఖ్యమంత్రి కుమారుడిగా రాజకీయపరిపక్వత లేని నాయకుడంటూ ప్రచారం చేసిన వైసీపి పార్టీలకు ఫార్చ్యూన్ పత్రిక ప్రచురించిన కథనమే ఒక చెంపపెట్టు లాంటిది.

యువగళం నాయకుడిగానే కాకుండా మంత్రి పనితీరుతో ఇప్పుడు ఒక రాజకీయ నాయకుడి ఇమేజ్ కు లోకేష్ పరిమితం కాలేదు. రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త "టెక్నో -పొలిటికల్ శకానికి ఆయన దారులు వేశారనే చెప్పాలి. అందుకే ఫార్చ్యూన్ ఇండియా ఆంగ్లపత్రిక నారా లోకేష్ ను ఆగస్టు 2026 సంచికలో ఆంధ్రప్రదేశ్ రైజింగ్ స్టార్ (ఉద్భవిస్తున్న తార) అభివర్ణించిదనడంలో సందేహం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత నారా లోకేష్ చేపడుతున్న విధి విధానాలు తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రంలో నూతన శకానికి నాంది పలుకుతున్నాయని ఆసంచికలో ప్రశంసిచడం ప్రధాన అంశంగా చెప్పవచ్చు.. ఐటి, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన క్షణం నుంచి నారా లోకేష్ రాష్ట్రాన్ని పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ ప్రాజెక్టు ఎ.పి సాంకేతిక విప్లవానికి ఒక మైలు రాయిగా నిలిచింది. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ , పునరుత్పాదక ఇంధనం, ఆటోమోటివ్ రంగాల్లో విదేశీ, స్వదేశీ దిగ్గజ సంస్థల నుంచి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 ఇండస్ట్రీయల్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నారని ఫార్చ్యూన్ ఇండియా కథనం ప్రస్తుతించింది. యువగళం ద్వారా ఆయన ప్రజలతో మమేకమై వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ఆయన రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన ఘట్టం. ఆ పాదయాత్ర ద్వారానే లోకేష్ ప్రజా నాయకుడిగా ఎదిగి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు.



వాసంశెట్టి సుభాష్
కార్మికశాఖ మంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

లోకేష్ కేవలం పాతతరం రాజకీయ నాయకులకు మాత్రమే పరిమితం కాకుండా నేటి "జెన్ -జీ" యువతతో నిరంతరం మమేకమవుతున్నారు.

వారసత్వం దాటి సొంత ముద్ర దిశగా అడుగులు వేస్తూ పరిణితి చెందిన టెక్నో పొలిటిషియన్ నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆశిద్దాం.

# యాదగిరి గౌడ్ దశదిన కర్మకు మోకుదెబ్బ నాయకులు



నర్సంపేట,నేటిధాత్రి:

నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్డులో నివాసముంటున్న ముంజాల యాదగిరి గౌడ్ దశదిన కర్మ కార్యక్రమం మంగళవారం ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ నాయకులు యాదగిరి గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం యాదగిరి గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్,జిల్లా సలహాదారు రామగోని సుధాకర్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి మాచర్ల ఐలమల్లు గౌడ్, సీనియర్ పాత్రికేయుడు కారుపోతుల విజయ్‌కుమార్ గౌడ్, 10వ వార్డు మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి ప్రసాద్, గంధం చంద్ర మౌళి గౌడ్, కక్కెర్ల అశోక్ గౌడ్, గండి రాము గౌడ్, గోడిశాల గిరినాథ్ గౌడ్, మర్ధ శ్రీనివాస్ గౌడ్, చింత రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999